## శ్రీకాళహస్తి పుణ్యక్షేత్రంలో
# పితృదేవతలకు తర్పణాలు



శ్రీకాళహస్తి,జనవరి 29 ప్రభాతవార్త
శ్రీకాళహస్తి పుణ్యక్షేత్రంలో ప్రధానమైన రోజుల్లో రద్దీతో పాటు జీవనది పవిత్ర స్వర్ణ ముఖి నదిలో తర్పాణాలు వదలటం జరుగు తుంది. అయితే జీవనది పవిత్రతను కాపాడా ల్సి న దేవస్థానం, ఇరిగేషన్ శాఖ అధికారులు ఎందుకో స్వర్ణముఖి నదిని శుభ్రంగా పెట్టాలన్న ఆలోచన లేకపోవటం శోచనీయం. బుధవారం స్వర్ణముఖి నది ఒడ్డున తైఅమా వాస్య సందర్భంగా వేలాది మంది పితృదేవతలకు తర్పాణాలు వదలటానికి తరలి వచ్చారు. వారికి రాఘవేంద్రస్వామి మఠం పక్కన ఉన్న మండపంలో చక్కటి ఏర్పాట్లు చేసారు.


# తిరుపతి - చిత్తూరు





తెలుగు జాతీయ దినపత్రిక
వార్త


## గజవాహనంపై విహరించిన
# అలివేలు మంగ

తిరుచానూరు, జనవరి 29, ప్రభాతవార్త
తిరుచానూరు తిరుమాడ వీధులలో గజవాహనం పై శ్రీవారి దేవేరి అలివేలు మంగ తిరుమాడ వీధులలో విహరించారు. అమ్మవారి జన్మ నక్షత్రం ఉత్తరాషాఢ సందర్భంగా బుధవారం సాయంత్రం అమ్మవారు తిరుమాడ వీధులలో గజవాహనం పై కొలువుదీరి భక్తులకు అభయమిచ్చారు. ఆలయ ముఖ మండపం వద్ద స్నపన తిరుమంజనం అనంతరం అమ్మవారిని మాడవీధులలో విహరించారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ రమేష్, ప్రసాద్ఇన్స్పెక్టర్ చలపతి, అర్చకులు, ఏవిఎస్ఓ సతీష్ ఇతర తితిదే సిబ్బంది పాల్గొన్నారు.



# శ్రీహరికోటకు 'వంద'నం... ఇస్రోకు ఇం'ధనం'

- ఒకే నేల నుంచి 100 రాకెట్ల ప్రయోగం - రెండు ప్రయోగ వేదికల ద్వారా ఈ గఘన చరిత్ర
- 46 ఏళ్లలో సెంచరీ మార్క్ చేరుకున్న ఇస్రో - శత ప్రయోగ విజయంతో పులకించిన షార్
- రూ.4 వేల కోట్లతో మూడవ ప్రయోగ వేదికకు త్వరలో శంకుస్థాపన
- డాలర్ల పంట పండిస్తున్న ఒకప్పటి గ్రామాల దీవి



అంతరిక్షానికి ఎగిరిన షార్ 100వ రాకెట్ జిఎస్ఎల్వి-ఎఫ్15



సెంచరీ సాధించిన సంబరాలు



శ్రీహరికోట (తడ), జనవరి 29 ప్రభాతవార్త
శ్రీహరికోట ఒకప్పుడు పురాణ చారిత్రక ప్రసిద్ధి చెందిన దీవి. అనంతరం అది చల్లా యానాదులకు, ఇతర కొన్ని జాతులకు ఆధారమైన ప్రదేశం. భారత అంతరిక్ష పరిశోధన సంస్థ బుడిబుడి అడుగులు వేస్తున్న సమయాన విక్రమ్ సారాభాయ్ ఈ ప్రాంతాన్ని గుర్తించి ఇక్కడ రాకెట్ ప్రయోగ కేంద్రం ఏర్పాటు చేయాలని కేంద్ర ప్రభుత్వానికి సిఫార్సు చేశారు. అప్పటి ప్రధానమంత్రి జవహర్లాల్ నెహ్రూ ఈ ప్రతిపాదనను అంగీకరించారు. ఆ తర్వాత ఈ దీవి రూపురేఖలు మారిపోయాయి. ఒకప్పటి ఉమ్మడి నెల్లూరు జిల్లా సూళ్లూరుపేటకు 17 కిలోమీటర్ల దూరంలో శ్రీహరికోట ఉంది. ఇక్కడ పలు గ్రామాల్లో అప్పటికి నాగరికత తెలియని జనం నివసించేవారు. క్యాలెక్స్ దోమలు కుట్టడం వలన బోదకాలు వ్యాధి వ్యాపించేది. అయితే ఈ అడవిలో దొరికే విస్తారమైన పండ్లు, కూరగాయలు వీరికి జీవనాధారం. ప్రధాన గ్రామాలతో పాటు శ్రీహరికోట సమీపంలోని సముద్రం వద్ద జాలర్లు, అడవి ప్రాంతంలో గిరిజనులు నివసించేవారు. జాతి ప్రయోజనాల దృష్ట్యా వీరందరినీ కేంద్రప్రభుత్వం ఇతర ప్రాంతాల్లో పునరావాసం కల్పించింది. అది అప్పటి మాట. ఇప్పుడు శ్రీహరికోట దీవి ప్రపంచంలోనే ఒక చారిత్రాత్మక ప్రాంతంగా నిలిచిపోయింది. భారత అంతరిక్ష పరిశోధన సంస్థ అభివృద్ధికి ఈ దీవి గుండెకాయలా నిలిచింది. మినీ రాకెట్తో మొదలయిన రాకెట్ ప్రయోగాల ప్రస్థానం బాహుబలి రాకెట్ల ద్వారా అంతకంతకూ పెరిగింది. బుధవారం ఏకంగా ఇక్కడి నుంచి 100వ రాకెట్ను ఇస్రో శాస్త్రవేత్తలు ప్రయోగించారు. ఈ 100లో 90 రాకెట్లు విజయవంతం కావడం గమనార్హం. ఉపగ్రహాలను మోసుకెళ్లగలిగే రాకెట్ల సంఖ్య మాత్రమే 100. మరికొన్ని వందల మినీ రాకెట్లు ప్రత్యేక విధానంలో సందర్శకుల కోసం ఎగురవేసే రాకెట్లు ఎన్నో ఉన్నాయి. షార్ అంటే ఇప్పుడు తెలియని వారు లేరు. ఈ 100వ ప్రయోగం తర్వాత షార్ మరింత వేగంగా ఉపగ్రహాలను మోసుకెళ్లగలిగే రాకెట్ల ప్రయోగాలు జరపనుంది. ఏకంగా 4 వేల కోట్లతో మూడవ ప్రయోగ వేదిక నిర్మిస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం ఇటీవలే ఈ మేరకు ప్రకటన చేసింది. మన దేశీయ ఉపయోగాల కోసమే కాకుండా విదేశీ ఉపగ్రహాలను అలవోకగా అంతరిక్షంలోకి పంపిస్తూ ఇస్రో డాలర్ల ఆర్జన చేస్తోంది. రాకెట్ ప్రయోగ వేదికలు లేని దేశాలు మన శ్రీహరికోట వైపు చూస్తున్నాయి. విజయాల ఫలితాలు ఇందుకు కారణమయ్యాయి. బుధవారం ఉదయం జిఎస్ఎల్వి-ఎఫ్15 ప్రయోగ విజయంతో శ్రీహరికోటను ఇది తమ నేల అని చెప్పుకునే వారు ఎంతో సంబర పడ్డారు. అక్కడ పనిచేసే శాస్త్రవేత్తలు, ఇతర ఉద్యోగులు మాత్రమే కాకుండా జాతి ప్రయోజనాల కోసం ఆ ప్రాంతాన్ని వదిలి వెళ్లిన వారు షార్కు సమీపంలో ఉన్న మరికొన్ని దీవుల ప్రజలు కూడా ఈ రాకెట్ ప్రయోగంపై ఆసక్తి పెంచుకొని తెల్లవారుజామున సూర్యుని కన్నా ముందే అంతరిక్షంలోకి దూసుకెళ్లిన రాకెట్ను తిలకించారు. సూళ్లూరుపేట, శ్రీహరికోట మార్గంలో సందర్శకులు ఎక్కువగా ఉండటం కాకుండా వీక్షకుల గ్యాలరీ నుంచి కూడా ఉదయం పూట బాగా కనిపించే దృశ్యాలను వీక్షించారు. సిఐఎస్ఎఫ్ దళాలు, తిరుపతి జిల్లా పోలీసు అధికారులు పటిష్టమైన బందోబస్తు ఏర్పాట్లు చేశారు.

## ప్రతిష్టకు పోతున్న కూటమి
# పావులుకదుపుతున్న వైసిపి
## -ఒక్క డిప్యూటీ మేయర్ ఛాన్స్ బలమెవరిదో!?

ప్రభాతవార్త-తిరుపతి:



తిరుపతినగరపాలక తొలికౌన్సిల్లో ఖాళీ అయిన ఒక డిప్యూటీమేయర్ స్థానం భర్తీ విషయం పాముకు చెలగాటం కప్పకు ప్రాణసంకటం అనే చందంగా తయారైంది. తాజా అధికార కూటమిపార్టీలకు (టిడిపి, బిజెపి, జనసేన), కౌన్సిల్లో పూర్తిస్థాయి బలమున్న వైసిపికి డిప్యూటీ మేయర్ ఎన్నిక సవాల్గానే మారింది. ఇక ఉన్న ఏడాదికాలంలో కౌన్సిల్లో పూర్తిపట్టుకోల్పోకుండా సత్తా చాటాలనే బలమైన విశ్వాసంతో వైసిపి నేతలు తమ కార్పొరేటర్లను కాపాడుకునే ప్రయత్నంలో ఉన్నారు. ఇందుకు అవసరమైన అన్ని అస్త్రశస్త్రాలను ప్రయోగిస్తున్నారు. 2021లో ఎలాంటి పరిస్థితుల్లో తిరుపతిలో తొలిసారిగా నగరపాలకసంస్థకు ఎన్నికలు జరిగాయి,ఆ ఎన్నికల్లో వైసిపి గుర్తుపై ఏకగ్రీవం కావడం, ఏకంగా మరికొందరు పోటీచేసి గెలవడం వంటి విషయాలు మాజీ ఎంఎల్ఎ, ఉమ్మడిచిత్తూరుజిల్లా వైసిపి అధ్యక్షుడు భూమన కరుణాకర్రెడ్డి తమ పార్టీ కార్పొరేటర్లతో చర్చించుకొంటున్నారు. గత నాలుగేళ్ళలో కార్పొరేషన్లో జరిగిన అభివృద్ధి పనులు, ప్రజలకు ఏం చేశామని గుర్తుచేస్తున్నారనేది సమాచారం. ఈ నేపథ్యంలో ఎనిమిది నెలల క్రిందట సార్వత్రిక ఎన్నికల్లో రాష్ట్రంలో అధికారం చేపట్టిన టిడిపి, జనసేన, బిజెపి కూటమి పార్టీల్లో తిరుపతి స్థానాన్ని జనసేన చేజిక్కించుకుని పాలన సాగిస్తోంది. ఇక్కడ సిట్టింగ్ ఎమ్మెల్యేగా ఆరణి శ్రీనివాసులు ఇప్పటికే కొందరు వైసిపిలో గెలిచిన పదిమందివరకు కార్పొరేటర్లను తన వెనుక తిప్పుకుని ఉనికిచాటుకునే ప్రయత్నంలో ఉన్నారనేది వైసిపి ప్రధాన ఆరోపణ. ఇందుకు సరిగ్గా ఇప్పుడు కౌన్సిల్లో ఖాళీగా ఉన్న డిప్యూటీ మేయర్ స్థానం భర్తీకి ప్రభుత్వం, ఎన్నికల కమిషన్ నోటిఫికేషన్ ఇచ్చింది. ఈ దరిమిలా గురువారం(నేడు) తిరుపతి నగరపాలకసంస్థలో జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్, జిల్లా ఎస్పీ వి.హర్షవర్ధన్రాజు, నగరపాలక సంస్థ కమిషనర్ మౌర్య,నగరపాలక కౌన్సిల్ మేయర్ డాక్టర్ శిరీషతో సమావేశమై అవసరమైన కార్యాచరణ సిద్ధం చేయనున్నారు. ఇప్పటికే కార్పొరేషన్ కౌన్సిల్లో 47మంది వరకు బలమున్న వైసిపి కార్పొరేటర్లలో 42వ డివిజన్ కార్పొరేటర్ శేఖర్రెడ్డిని డిప్యూటీ మేయర్ పదవికి ఎంపిక చేసేందుకు వైసిపి వర్గాలు నిర్ణయం తీసుకున్నారు. ఫిబ్రవరి 3వతేదీ జరగనున్న ఈ ఎన్నికల్లో ఆయననే ఏకగ్రీవంగా గెలిపించుకోవాలని ఆ పార్టీ కార్పొరేటర్లతో సమావేశంలో తీర్మానించారనేది సమాచారం. ఈ సమావేశానికి కూటమికి మద్దతు తెలిపిన కొందరు కార్పొరేటర్లు గైర్హాజరు కావడం, వారి మద్దతు నిచ్చినా డిప్యూటీ మేయర్ పదవిని అందుకోలేరనేది వైసిపి వర్గాల నమ్మకం. మరీ కూటమి వైపు మద్దతుగా నిలబడుతున్న పదిమంది వరకు వైసిపి కార్పొరేటర్లు వ్యతిరేకంగా ఓటు వేస్తే బహిష్కరణ వేటుపడనుంది. అంతేగాక తిరుపతి కౌన్సిల్లో ఒకేఒక టిడిపి కార్పొరేటర్ ఆర్సి మునికృష్ణ కొనసాగుతున్నారు. ఈయన అందరితో సఖ్యతగా మెలగుతూ టిడిపిలోని నాయకులతో కలసిమెలసి ఉంటున్నారు. గతంలో ఆయన తిరుపతి నగర అధ్యక్షుడుగా, గంగమ్మగుడి ఛైర్మన్గా మంచిపేరు తెచ్చుకున్నారు. ఇప్పుడు డిప్యూటీ మేయర్ స్థానానికి ఆర్సి పేరును కూడా కూటమి నేతలు పరిశీలనలోకి తీసుకుంటున్నట్లు తెలుస్తోంది.

## వీర జవాన్ కుటుంబానికి
# రూ. కోటి మంజూరు
## - ఎమ్మెల్యే డాక్టర్ కలికిరి మురళీమోహన్



బంగారుపాళ్యం, జనవరి 29 ప్రభాతవార్త:
జమ్ము-కాశ్మీర్ నార్త్ జిల్లాలో జరిగిన ఉగ్రదాడిలో ప్రాణాలు కోల్పోయిన వీరజవాన్ కార్తీక్ కుటుంబానికి ప్రభుత్వం కోటి రూపాయలు మంజూరు చేయడానికి అనుమతించిందని పూతలపట్టు ఎమ్మెల్యే డాక్టర్ కలికిరి మురళీమోహన్ చెప్పారు. మొగిలీశ్వాలయంలో బుధవారం కలెక్టర్ సుమిత్కుమార్తో కలిసి ఎమ్మెల్యే డాక్టర్ కలికిరి మురళీమోహన్ విలేకరులతో మాట్లాడుతూ దేశ రక్షణ కోసం ప్రాణాలు ఒడ్డిన వీర సైనికుడు కార్తీక్ కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం అండగా వుందన్నారు. ఆ కుటుంబానికి భారీ మొత్తం లో ఆర్థిక సహాయం అందించడానికి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అంగీకరించారని పేర్కొన్నారు. కార్తీక్ కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం తరపున కోటి రూపాయలు చెక్కును త్వరలో అందిస్తామన్నారు. దశదిన కర్మ రోజే ఆ కుటుంబసభ్యులకు 5 ఎకరాల భూమి, 5 సెంట్ల ఇంటి స్థలం, సైనికుడు చదువుకున్న పాఠశాల ఆవరణలో విగ్రహ ఏర్పాటు చేయనున్నట్లు ఎమ్మెల్యే చెప్పారు. ప్రభుత్వం అందజేసే ఆర్థిక సహాయ చెక్కును త్వరలో ఆ కుటుంబీకులకు అందిస్తామన్నారు.

## కళ్ళలో కారంచల్లి...
# దారిదోపిడి యత్నం
## -యువకుడికి గాయాలు



గాయపడిన వినయ్

తవణంపల్లె, జనవరి 29 ప్రభాతవార్త:
పట్టపగలు దారిన వెళుతున్న వారి కళ్ళలో కారం పొడి చల్లి దారి దోపిడికి యత్నించిన సంఘటన మండలంలోని మాధవరం-రాయల్పేట అటవీ మార్గంలో బుధవారం మధ్యాహ్నం చోటుచేసుకుంది, ఈఘటనలో యువకుడికి తీవ్రగాయాలు కావడంతో చికిత్స నిమిత్తం అరగొండలోని ఓ ప్రయివేటు ఆస్పత్రిలో చేరాడు. గ్రామస్థుల కథనం మేరకు వివరాలిలావున్నాయి. మండలంలోని ఎం.బోయపల్లెకు చెందిన బి.మహేష్ భార్య అరుణ(30) తన పుట్టిల్లు సోమల మండలం పెద్దవుప్పరపల్లె సమీపంలోని పేటూరుకు వెళ్ళి బుధవారం మధ్యాహ్నం సుమారు 3 గంటలకు అదే గ్రామానికి చెందిన తన మేనల్లుడు వినయ్తో కలసి మోటారుసైకిల్పై రాయల్పేట-మాధవరం అటవీ మార్గం గుండా తిరుగు ప్రయాణమయ్యారు. వీరు మాధవరం గ్రామం అటవీ ప్రాంతంలో వున్న వాటర్పాల్స్ సమీపంలోకి రాగా దారిలో గుర్తు తెలియని యువకుడు వినయ్, అరుణ కళ్ళలో కారం చల్లి దోపిడి యత ్నం చేశారు. దీనితో వారు గట్టిగా కేకలు వేయడంతో ఆదారిన మరో మోటారుసైకిల్ రావడంతో గుర్తు తెలియని యువకుడు అక్కడి నుండి పరారయ్యారు. కళ్ళలో కారం చల్లడంతో మోటారు సైకిల్ అదుపుతప్పి కిందపడడంతో వినయ్కు కాలికి తీవ్ర గాయమైంది. విషయం గ్రామంలో తెలియడంతో పరిసర గ్రామాల ప్రజలు నిందితుని కోసం తీవ్రంగా గాలిం చారు. అయితే అతడు అక్కడి నుండి పరారవ డంతో గ్రామస్థులు వెనుతిరిగారు. గాయపడిన వినయ్ను అరగొండలోని ఓ ప్రయివేటు అస్పత్రికి

# రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి
## కుటుంబాల్లో విషాదం



రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన స్నేహితులు

శ్రీకాళహస్తి,జనవరి 29 ప్రభాతవార్త
జీవనోపాధి కోసం పిచ్చాటూరుకు వెళ్ళి తిరిగి వస్తున్న సమయంలో రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి చెందిన సంఘటన బుధవారం చోటు చేసుకుంది. శ్రీకాళహస్తి మండలం చెర్లోపల్లి, మిట్ట కండ్రిగ గ్రామాలకు చెందిన యు వకులు తమకున్న ట్రాక్టర్లతో గడ్డి వ్యాపారం చేస్తుంటారు. శ్రీకాళహస్తి, సత్యవేడు నియోజక వర్గాల్లో గడ్డి సేకరించి పడమటి ప్రాంతాలైన మనదపల్లి,పీలేరు ప్రాంతంలో తరలిస్తూ వ్యాపారం చేస్తుంటారు.ఈ నేపథ్యంలో శ్రీకాళహస్తికి సమీపంలోని చెర్లోపల్లి గ్రామానికి చెందిన గణేష్ అనే డి.గంగాధరం (26) ఆతని స్నేహితుడు మిట్ట కండ్రిగకు చెందిన ఎం.లక్ష్మయ్య(36) కలసి గడ్డి వ్యాపారం చేస్తూ పిచ్చాటూరుకు వెళ్ళి తిరిగి వస్తుండగా పిచ్చాటూరు ఆరణియార్ ప్రాజెక్టు వద్ద ఎదురుగా వస్తున్న శ్రీకాళహస్తికి చెందిన కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో మోటార్సైకిల్పై పయనిస్తున్న ఇద్దరు స్నేహితులు గణేష్,డి.గంగాధరం అక్కడికక్కడే మృతి చెందారు.

శ్రీకాళహస్తికి చెందిన యువకులు బతుకు జీవనం కోసం చుట్టుపక్కల గ్రామాలకు వెళుతుంటారు.ఈ నేపథ్యంలో ఇద్దరు స్నేహితులు కలసి వెళ్ళారు. గణేష్కు వివాహం కాలేదు. కానీ లక్ష్మయ్యకు ముగ్గురు ఆడిపిల్లలున్నారు. విషయం తెలిసిన వెంటనే కుటుంబాల్లో విషాదం చోటు చేసుకుంది.లక్ష్మయ్య ప్రమాదంలో మృతి చెందినట్లు తెలిసిన వెంటనే ఆతని సతీమణి కుప్పకూలింది. ముగ్గురు ఆడబిడ్డలతో ఈ కుటుంబాన్ని ఎలా నెట్టుకురావాలని తల్లడిల్లుతుంది.

# తీరుమారని ప్రభుత్వ వైద్యం

- ప్రసవం కోసం వెళితే పసి కందు ప్రాణం తీసిన వైనం
- డాక్టర్ అందుబాటులో లేకపోవడంతో స్టాఫ్ నర్సు కాన్పు
- చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రికి వెళితే కాన్పు అయిన వెంటనే పసికందు మృతి అని తేల్చిన వైద్యులు

పాలసముద్రం, జనవరి 29 ప్రభాతవార్త:
ప్రభుత్వ వైద్యం తీరు ఏ మాత్రం మారలేదు. ప్రభుత్వ వైద్యశాలు కార్పొరేట్ వైద్యశాలలకు ధీటుగా పని చేస్తున్నాయని పత్రికల్లో చూస్తుండటమే కానీ క్షేత్ర స్థాయిలో మాత్రం ప్రభుత్వ వైద్యశాలల్లో రోగులకు వైద్యం నరకం చూపిస్తోంది. పాలసముద్రం పిహెచ్సిలో ప్రసవం కోసం వెళ్ళిన ఓ గర్భిణీకి ప్రసవం చేసిన వైద్య సిబ్బంది కడుపు నుండి మృతి చెందిన పసికందును బయటికి తీయడంతో మరోసారి ప్రభుత్వ వైద్యశాలల్లో వైద్యం ఎలా వుంటుందనే విషయం అందరికి అర్థమైంది. మండలంలోని నరసింహాపురం గ్రామానికి చెందిన ప్రతిభ గర్భవతి కావడంతో ప్రసవం కోసం మంగళవారం పాలసముద్రం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంకు వెళ్ళింది. ఉదయం 11 గంటలకు ప్రతిభ మగబిడ్డ వాడికి జన్మనిచ్చింది. ఈ సమయంలో విధుల్లో వుండాల్సిన వైద్యాధికారి అందుబాటులో లేకపోవడంతో ప్రతిభకు సరైన వైద్యం అందలేదు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో విధుల్లో వున్న నర్సులు ప్రతిభకు కాన్పు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. ప్రతిభ మగ శిశువుకు జన్మ ఇచ్చిందని తెలిసిన ఆమె కుటుంబసభ్యుల కళ్ళల్లో సంతోషం వెల్లివిరిసింది. అయితే స్టాఫ్ నర్సు వచ్చి జన్మించిన మగబిడ్డలో స్పర్శ లేదని చెప్పడంతో ఆందోళనకు గురైన ప్రతిభ భర్త దినేష్ మెరుగైన చికిత్స కోసం చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రికి ప్రతిభను తరలించాలని నిర్ణయించి 108 వాహనానికి ఫోన్ చేశారు. అక్కడి నుండి హుటాహుటిని 108 వాహనంలో ప్రతిభతో పాటు పుట్టిన పసికందును చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రికి వైద్యం కోసం తరలించారు. అయితే చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రి వైద్యాధికారులు పసికందును పరిశీలించి పుట్టిన సమయంలోనే బిడ్డ చనిపోయాడని చావు కబురు చల్లగా చెప్పడంతో ప్రతిభ ఆమె భర్త దినేష్ వారి బంధువులు కన్నీటి పర్యంతం అయ్యారు. తమ సంతాపం పాలసముద్రం పిహెచ్సి వైద్య సిబ్బంది నిర్లక్ష్యంతోనే మృతి చెందారని బంధుమిత్రులు ఆరోపిస్తున్నారు. అలాగే తనకు జరిగిన అన్యాయానికి ఎవరు న్యాయం చేస్తారని పుట్టిన బిడ్డను కోల్పోయిన ప్రతిభ కన్నీటి పర్యంతం అవుతుంది. ఈ విషయంపై సమగ్ర విచారణ నిర్వహించి బాధ్యులైన వైద్యాధికారులు, సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని, ఇకపై ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా పక్కాగా చర్యలు తీసుకోవాలని ప్రతిభ కుటుంబసభ్యులు జిల్లా అధికారులను డిమాండ్ చేస్తున్నారు.

## దేశం ఫస్ట్...పార్టీ సెకండ్...
# నేను లాస్ట్ అనే సిద్ధాంతం బీజేపీది
## - రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖా మంత్రి సత్యకుమార్ యాదవ్



తిరుపతి కలెక్టరేట్, జనవరి 29 ప్రభాతవార్త :
దేశం మొదట, పార్టీ తరువాత, నేను చివర అనే సిద్ధాంతంలో బీజేపీ పార్టీ, నేను ముందుకు వెళుతున్నా మని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖా మంత్రి సత్యకుమార్ యాదవ్ అన్నారు. తిరుపతి శిల్పారామంలో బుధవారం రోటరీ క్లబ్ వారి ఆధ్వర్యంలో 29,30వ తేదీల్లో నిర్వహిస్తున్న జ్ఞాన క్రియ సమ్మేళనం 41వ జిల్లా సమావేశంలో మొదటి రోజు మంత్రి ముఖ్య అతిథిగా హాజరైయ్యారు. మంత్రి మాట్లాడుతూ రోటరీ క్లబ్కు సంబంధించిన ఏపీ, కర్నాటక రాష్ట్ర సభ్యులందరికీ శుభాకాంక్షలు తెలిపారు.రోటరీ క్లబ్ కృషి వలన దేశ, ప్రపంచ వ్యాప్తంగా 99 శాతం పోలియో కేసులు తగ్గాయని, వారి చేసిన సేవలు ఎనలేనివని తెలిపారు. రాయలసీమ, కడపజిల్లా ప్రొద్దుటూరుకు చెందిన వ్యక్తి రోటరీ జిల్లా గవర్నర్గా ఎన్నికైన సాదు గోపాల కృష్ణకి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్కు సంబంధించిన ఏపీ, కర్నాటక రాష్ట్ర సభ్యులు పాల్గొన్నారు.

# నేతలా.. 'గొడ్డేరు' ఆక్రమణలను అడ్డుకోండి

శ్రీకాళహస్తి, జనవరి 29 ప్రభాతవార్త
శ్రీకాళహస్తీశ్వరాలయానికి పడమరగా దక్షిణం నుంచి ఉత్తరానికి ప్రవహించే 'గొడ్డేరు' సుమారు మూడు కిలో మీటర్లు కైలాసగిరుల్లోని నీటిని తీసుకొని స్వర్ణముఖి నదిలో కలుస్తుంది. ఈ గొడ్డేరు వర్షాకాలం అధిక పారుదల ఉంటుంది. అయితే ఈ కాలువ పూర్వం నుంచి సర్వే నెంబర్ 306లో ఉంది.ఈ కాలువ దశల వారిగా ఆక్రమణలకు గురౌతుంది. దీనిని అడ్డుకునే దిక్కేలేదు. కాలువ కొండల్లోంచి దిగువకు రాగానే మొదట్లో నాడు నిర్మిత కేంద్రం ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. దీని చుట్టూ ఇళ్లు ఏర్పడ్డాయి.ఇక అక్కడ నుంచి కాలువ సాగుతుంది. కాలువ ఒడ్డును ఎవరికి పలుకుబడి ఉంటే వారు అక్రమించుకోవటం మొదలెట్టారు. ఆదిలోనే అడ్డుకోవాల్సిన పాలకులు పట్టించుకోలేదు. అధికారుల తిరిగి చూడలేదు. ప్రస్తుతం దేవస్థానం టూరిస్టుబస్టాండు నిర్మాణ సమయంలో దేవస్థానం అధికారులు కూడా కాలువ లోపలికి చొచ్చుకుపోయారు.'కంచే చేను మేస్తే'అన్నట్లు పరిస్థితి మారింది. అక్కడ నుంచి ఒక్కొక్కరు ఒకరిని చూసి ఒకరు గొడ్డేరులో పాగా వేసారు.ప్రారంభంలో 140 అడుగులున్న కాలువ స్వర్ణముఖి నది వద్దకు వచ్చే సరికి కనీసం పది అడుగులు కూడా లేదు.ఇక్కడ వరుసగా లాడ్జిలు ఏర్పడ్డాయి. ప్రతి లాడ్జి కాలువలో కొంత క్రమించుకున్నారు. జలవినాయక ఆలయానికి సమీపంలోని లాడ్జి అయితే సుమారు కాలువ చివరిలో సుమారు 15 అడుగులు లోపలకు వెళ్ళి కాలువలో నిర్మాణాలు చేపట్టారు.అప్పుడు కూడా రాజకీయ పలుకుబడితో అధికారులు మౌనం వహించారు.రెండేళ్ళ క్రితం భారీ వర్షాలకు గొడ్డేరు



ఆక్రమణలో గొడ్డేరు

పై భాగంలో ముంపుకు గురయ్యాయి.

### కాలువ మీద చిన్న పైపులతో వంతెనలు:

గొడ్డేరు మీద ఎవరి ప్రయోజనం వారు చూసుకున్నారు.ఓ స్టార్ హోటల్ రెండు చోట్ల వంతెనలు నిర్మించారు.అయితే నిర్మాణం సమయంలో చిన్న చిన్న పైపులు ఏర్పాటు చేసారు.నీటి ప్రవాహానికి సంబందించి అధికారులు పట్టించుకోలేదు. దాంతో పరిస్థితి ఆగమ్యగోచరంగా మారింది. ఇక కాలువ ఒడ్డును ఇటు అటు నిర్మించుకున్న లాడ్జిల యజమానులు పైపులను కాలువలోకి వదలిపెట్టడంతో గొడ్డేరు మురికినీటి కాలువగా మారింది. ఈ ఆక్రమణలు ఇంకా కొనసాగుతూనే ఉన్నాయి. అయితే అధికారులు ఎందుకో మౌనం వహిస్తున్నారు. ఇక పాలకులు ఆక్రమణల తొలగింపుకు సాహసించలేకపోతున్నారు. పోనీ ఇక్కడ రాజకీయ నాయకులకు ఓట్లు ఏమైనా వస్తాయా? అంటే అన్ని వ్యాపార సంస్థలే.ఈ కాలువకు సంబంధించి పలుమార్లు రెవెన్యూశాఖ సర్వేలు కూడా జరిపాయి. మరి ఎందుకు చర్యలు తీసుకోలేదన్నది డాలర్ ప్రశ్న.

### వరద నీటి కాలువ మురికినీటి కాలువగా మారింది.

ఒక నాడు గొడ్డేరు అంటే వరదనీటి కాలువ. ఇసుకతో నిండి నిగ నిగ లాడేది. అయితే దక్షిణం వైపు ఇసుక తిన్నెలు మాయమయ్యాయి.తోటలు వెలిసినాయి. వీటిని కూడా తొలగించలేని నిస్సహాయ స్థితి అధికారులది. తహశీల్దార్ కార్యాలయమే కాదు. ఆర్డిఓ కార్యాలయం కూడా ఇక్కడే ఉంది. కానీ ఎవ్వరూ వీటిమీద దృష్టి సారించరు.ఇక దేవస్థానం టూరిస్టుబస్టాండు వద్ద నుంచి పరిశీలిస్తే 140 అడుగుల కాలువ కేవలం మూడుఅ డుగుల మురికినీటి కాలువగా దర్శనమిస్తుంది.ఇక్కడ దేవస్థానం చక్కగా కాలువ ఎంతుందో అంత శ్లాబ్వేసి కింద వరద నీటిని వదలిపెట్టి పైన రోడ్డు నిర్మించుకుంటే సుమారు వంద అడుగుల రోడ్డు అవుతుంది. దీనిని వదలిపెట్టి కరకట్టమీదుగా రోడ్డు వేస్తామనటం గమనిస్తే పాలకులు, అధికారులకు అవగహన లేదన్నది స్పష్టమౌతుంది. ఆచరణ సాధ్య అంశాలను పట్టించుకోకుండా ఆలోచనలు చేయటం ప్రణాళికలు రూపొందించటం గమనిస్తే ఆశ్చర్యమేస్తుంది.

## సైన్స్ ఫేర్‌లో ఆకాష్ అద్భుత ప్రతిభ



**కల్లూరు, జనవరి 29, ప్రభాతవార్త** పల్లెటూరు కుర్రోడు.. వ్యవసాయ కుటుంబం.. సర్కారు బడి.. అయితే నేమి... చదువులో రాణించాలని దృఢ సంకల్పం, అందరిలో ఒకడు కాకుండా.. తనకంటూ ప్రత్యేక గుర్తింపు సాధించాలని ఆత్మవిశ్వాసం.. పాఠశాల హెచ్ఎం సహకారం, తల్లిదండ్రుల ప్రోత్సాహం, విద్యలో ప్రతిభ చూపుతున్న సామాన్య విద్యార్థిని అసామాన్య విద్యార్థిగా తీర్చిదిద్దాలనే గైడ్ టీచర్ ఆశయం. వెరసినా దారి అవార్డుల దారి అంటూ నిరూపించాడు.. చిత్తూరు జిల్లా పులిచెర్ల మండలం ఎల్లంకి వారి పల్లి 9వ తరగతి విద్యార్థి ఆకాష్ గైడ్ టీచర్ ఉషారాణి సహకారంతో రాష్ట్ర స్థాయిలో ప్రతిభ చూపడంతో పాండిచ్చేరిలో జరిగిన సౌత్ ఇండియా సైన్స్ ఫేర్ 2025కు ఎంపికై అక్కడ ప్రతిభ చాటి ప్రత్యేక బహుమతి సాధించి ప్రభుత్వ బడిని తలెత్తుకునేలా నిలిపాడు. ప్రత్యేక బహుమతి పొందిన ఆకాష్‌ను గౌడ్ టీచర్ ఉషారాణి, ఎంఈఓలు సిద్ధరామయ్య, పోకల తాతయ్య, హెచ్ఎం హరి శంకర్, సిఆర్పి యూసఫ్, మహమ్మద్ మునీర్ అహ్మద్, ఉపాధ్యాయులు అభినందించారు.

## 5 కోట్లతో రోడ్డు పనులు ప్రారంభించిన ఎమ్మెల్యే పులివర్తి నాని

**యర్రావారిపాల్యెం, జనవరి 29, ప్రభాతవార్త** యర్రావారిపాల్యెం క్రాస్ నుండి చెరుకువారిపల్లి వయా రోడ్డును ఎమ్మెల్యే పులివర్తి నాని ప్రారంభించారు. ముందుగా యర్రావారిపాలెం క్రాస్‌కు చేరుకున్న ఎమ్మెల్యేకు అర్చకులు, అధికారులు, నాయకులు, కార్యకర్తలు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం యర్రావారిపాల్యెం పంచాయితీ క్రాస్ – చెరుకువారిపల్లి నూతన ఆర్అండ్‌బి రోడ్డుకు శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. రిబ్బన్ కట్ చేసి రోడ్డును ప్రారంభించిన అనంతరం ఎమ్మెల్యే పులివర్తి నాని మాట్లాడుతూ యర్రావారిపాలెం క్రాస్ నుండి చెరుకువారిపల్లి వయా రోడ్డు 21 కిలో మీటర్ల రోడ్డును నాబార్డ్ నిధుల ద్వారా సుమారు 5 కోట్ల రూపాయలతో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టినట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఈ రోడ్డు వేయడం ద్వారా యర్రావారిపాల్యెం క్రాస్ నుండి రాయచోటికి వెళ్ళడానికి సుమారు 17 కిలోమీటర్లు రోడ్డు ప్రయాణం తగ్గడంతో పాటు సుమారు 40 గ్రామాల ప్రజలకు రాను పోను వీలుగా ఉంటుంది అని ఎమ్మెల్యే తెలిపారు. చంద్రగిరి నియోజకవర్గం అభివృద్ధికి పార్టీలకు అతీతంగా ముందుకు రావాలని ప్రజలకు, నాయకులకు కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మండల స్థాయి అధికారులు, కూటమి ప్రభుత్వం నాయకులు, కార్యకర్తలు, మహిళలు తదితరులు పాల్గొన్నారు. అనంతరం వెలుగు కార్యాలయంలో తలకోన మహాశివరాత్రి ఉత్సవాలు ఏర్పాట్లపై ఈవో, చైర్మన్, ఆలయ కమిటీ సభ్యులు, ఉన్నత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. సమీక్ష సమావేశానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే హాజరయ్యారు. ఫిబ్రవరి నెల 23 నుండి 27 తేదీ వరకు నిర్వహించే తలకోన మహాశివరాత్రి ఉత్సవాలు ఏర్పాట్లపై ఈఓ, చైర్మన్, ఆలయ కమిటీ సభ్యులు సూచనలు, సలహాలు అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా తలకోన మహాశివరాత్రి ఉత్సవాలలో వైభవంగా జరిపించాలని ఈఓ చైర్మన్, కమిటీ సభ్యులకు ఎమ్మెల్యే తెలిపారు. తలకోన మహాశివరాత్రి ఉత్సవాలకు రెవెన్యూ కరెంటు డిపార్ట్మెంట్, పంచాయితీ, పోలీస్ డిపార్మెంట్ వాళ్ళు చేస్తున్న ఏర్పాట్లపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. తలకోన మహాశివరాత్రి ఉత్సవాలకు ఎటువంటి ఆటంకం కలగకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు డిపార్మెంట్ అధికారులు ఎమ్మెల్యేకు తెలిపారు.



## విద్యుత్ షాక్‌తో వ్యక్తి మృతి

సదుం, జనవరి 29, ప్రభాతవార్త

పొలం వద్ద నీరు కట్టేందుకు వెళ్లి విద్యుత్ షాక్‌తో వ్యక్తి మృతి చెందిన సంఘటన సదుం మండలంలో బుధవారం జరిగింది. సదుం ఎస్ఐ షేక్షావలి కథనం మేరకు అమ్మగారిపల్లి పంచాయితీ ఎగువ జాండ్రపేటకు చెందిన పేర్ల అల్లాబకష్ (57) అనే వ్యక్తి అమ్మగారిపల్లె గ్రామానికి చెందిన రామస్వామి రెడ్డి పొలాన్ని లీజుకు తీసుకొని గడ్డి వేసుకున్నాడు. దీనికి నీరుకట్టేందుకుబుధవారం ఉదయం 10–11 గంటల మధ్య షెడ్డు వద్దకు వెళ్లి మోటర్ ఆన్ చేసి వచ్చారు. కొద్ది దూరం నడిచి కిందపడి మృతి చెందాడు. దీనిపై ఆయన కొడుకు లోషిత్ ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసుకునిమృతదేహాన్నిపోస్టుమార్టం పీలేరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు ఆయన చెప్పారు.

## ఏనుగుల పంట నష్ట పరిహారం నిధులు అందజేత

సదుం, జనవరి 29, ప్రభాతవార్త



పుంగనూరు రేంజ్ పరిధిలోని అటవీ సరిహద్దు మండలాలైన సదుం సోమల చౌడేపల్లి పెద్ద పంజాణి మండలాల్లో ఏనుగుల ద్వారా పంట నష్టం జరిగిన 129 మంది రైతులకు నష్ట పరిహారం కింద 144 ఎకరాలుకు సంబంధించి 11 లక్షలు రూపాయిలు ప్రభుత్వం మంజూరు చేసింది. ఇందులో సదుం మండలం సంబంధించిన 52 మంది రైతులకు 4,65,000 రూపాయిలు మంజూరయ్యాయి. గొల్లపల్లి గ్రామం లోకనాథ, హైమావతి, గొడ్డవారిపల్లి గ్రామం మోహన్ రెడ్డిలకు స్థానిక సోమల ఎంపిడిఓ నారాయణ ద్వారా బుధవారం నష్టపరిహారాన్ని డిడిల రూపంలో అందజేశారు. ఈ కార్యక్రమంలో ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ ఇంద్రాణి, సోమల, రాంపల్లి బీట్ ఎఫ్బిఓ రెడ్డి షాజహాన్, గొల్లపల్లి బీట్ ఎఫ్బిఓ మహేష్ పాల్గొన్నారు.

## మండల సర్వసభ్య సమావేశంలో ప్రోటోకాల్ రగడ

సోమల, జనవరి 29, ప్రభాతవార్త



మండల పరిషత్ మీటింగ్ హాల్లో బుధవారం ఎంపిపి ఈశ్వరయ్య అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సభను ప్రారంభించిన ఎంపిపి ఈశ్వరయ్య మాట్లాడుతూ ప్రభుత్వ కార్యాలయంలో ప్రోటోకాల్ ప్రకారం ఎంపి, ఎమ్మెల్యేల ఫోటోలు పెట్టాలా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. సభ్యులకు గౌరవం లేకుండాపోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామ సభ తీర్మానం సర్పంచుల సంతకాలు లేకుండానే ఎన్ఆర్ఈజిఎస్‌లో పనులు చేయడమేంటన్నారని దీనిపై పరిశీలించాలంటూ అధికారులను కోరారు. చిన్న వయసులోనే పిల్లలకు పెళ్లిళ్ళు చేయడంతో బాలికలు గర్భం దాలుస్తున్నారని దీంతో ప్రసవ సమయంలో ప్రాణాల మీదికి తెచ్చుకుంటున్నారని వైద్యాధికారి ఆవేదన వ్యక్తం చేశారు. నెల్లిమంద పంచాయితీలో ఇలాంటి కేసులు అధికంగా ఉన్నాయని ఐసిడిఎస్ సిబ్బంది పట్టించుకోకపోవడంతో ఇలాంటి సమస్యలు వస్తున్నాయని అన్నారు. గ్రామాల్లో తాగునీటి సమస్య నివారించేందుకు చర్యలు తీసుకోవాలని సోమల ఎంపిటిసి సావిత్రమ్మ కోరారు. సమావేశానికి పలు శాఖల అధికారులు హాజరు కాకపోవడం పై సభ్యులు ఎంపిడిఓ ఫిర్యాదు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసిలు, సర్పంచులు, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

-మరొకరికి తీవ్ర గాయాలు

**పెద్దపంజాణి,జనవరి 29,ప్రభాతవార్త:**

రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా మరొక్కరికి తీవ్ర గాయాలైన సంఘటన మండలంలో మంగళవారం రాత్రి చోటు చేసుకుంది.స్థానికుల కథనం మేరకు..వెనుగొండ గ్రామానికి చెందిన కాకన్న కుమారుడు ఎల్లప్ప,వెంకటరమణ కుమారుడు సుబ్రమణ్యం ద్విచక్రవాహనంలో రాజుపల్లెపేట నుండి స్వగ్రామానికి వెళుతుండగా జిట్టంవారిపల్లె వద్ద పెద్దపుల్యపల్లె నుండి తమిళనాడు వెళుతున్న ఒ బొలెరో వాహనం ఢీ కొన్నాయి.ఈ ప్రమాదంలో ద్విచక్రవాహనంపై ప్రయాణిస్తున్న ఎల్లప్ప,సుబ్రమణ్యంలు తీవ్రంగా గాయపడడంతో స్థానికులు 108 ద్వారా పలమనేరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే సుబ్రమణ్యం మృతి చెందగా తీవ్రంగా గాయపడిన ఎల్లప్పను తిరుపతి రుయా ఆసుపత్రికి తరలించారు..విషయం తెలుసుకున్న పెద్దపంజాణి పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసి ధర్యాప్తు చేస్తున్నారు.

## చైల్డ్ కేర్ హెల్ప్‌లైన్‌పై విస్తృతంగా అవగాహన

– విద్యార్థుల వేధింపులు, ఈవ్‌టీజింగ్‌పై గ్రీవెన్స్‌డేలో ఫిర్యాదు

– కలెక్టర్ సుమిత్‌కుమార్



**చిత్తూరు, జనవరి 29 ప్రభాతవార్త:** చైల్డ్ కేర్ హెల్ప్‌లైన్, ఆడపిల్లలు, మహిళల సంరక్షణకు సంబంధిం చిన చట్టాలపై విస్తృతంగా అవగాహన కల్పించడానికి స్త్రీ శిశుసంక్షేమశాఖ చర్యలు చేపట్టాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశించారు. కలెక్టరేట్‌లోని సమావేశభవనంలో బుధవారం కలెక్టర్ సుమిత్‌కుమార్ అధ్యక్షతన మిషన్ వాత్సల్య పథకం అమలు తీరుపై కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో కలెక్టర్ సుమిత్‌కుమార్ మాట్లాడుతూ పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థులను వేధించడం, ఈవ్ టీజింగ్ సమస్యలు వున్నట్లైతే సోమవారం కలెక్టరేట్‌లో జరిగే గ్రీవెన్స్‌డేలో కలెక్టర్, జెసిలకు ఫిర్యాదు చేయవచ్చునన్నారు. సమాజంలో మహిళలు, పిల్లలపై జరుగుతున్న అఘాయిత్యాలు, వేధింపుల నుండి వారిని కాపాడేందుకు చైల్డ్ మ్యారేజ్‌ను అడ్డుకట్ట వేయడానికి సంబంధిత శాఖలు సమన్వయంతో క్షేత్ర స్థాయి వరకు విధులు నిర్వర్తించాల్సిన అవసరం, ప్రాధాన్యత ఎక్కువ వుందన్నారు. అలాగే ఐసిడిఎస్ ద్వారా నిర్వహిస్తున్న చైల్డ్ కుర్ ఇన్‌స్టిట్యూషన్స్‌లో పటిష్టమైన భద్రత వుండాలని, పిల్లల భద్రతతో పాటు వారికందించే అన్ని వసతుల గురించి తెలుసుకుని లోటుపాట్లు వుంటే సరిదిద్దాలని ఆదేశించారు. అలాగే లేబర్ డిపార్ట్‌మెంట్ ద్వారా చైల్డ్ లేబర్‌ను గుర్తించి క్షేత్ర స్థాయిలో సంబంధిత శాఖలను సమన్వయం చేసుకుని ఈ అంశంపై పనిచేసి ఫలితాలు సాధించి చైల్డ్ లేబర్ నిర్మూలనకు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి ఎంఎస్ భారతి, స్త్రీ శిశు సంక్షేమశాఖ పిడి వెంకటేశ్వరీ, జడ్పీ సిఇఓ రవికుమార్‌నాయుడు, డిఎంహెచ్‌ఓ డాక్టర్ సుధారాణి, జిల్లా విద్యాశాఖ అదికారి వరలక్ష్మి, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

## రాష్ట్రాన్ని దోచుకోవడంలో జగన్‌ది చరిత్ర

కుప్పం, జనవరి 29 ప్రభాతవార్త



రాష్ట్రాన్ని దోచుకోవడంతో వైఎస్సార్సీ అధ్యక్షుడు జగన్‌ది ఓ చరిత్ర అని ఎపిఎస్ఆర్టీసీ వైస్ ఛైర్మన్ పిఎస్ మునిరత్నం పేర్కొన్నారు. బుధవారం కుప్పం ఎన్టీఆర్ భవన్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన ప్రసంగించారు. 2024–29మధ్య కాలంలో జగన్ కుటుంబం, వైఎస్సార్సీ నేతలు రేషన్ బియ్యం, ఇళ్ల పట్టాలు, ఇసుక, ఎర్రచందనం, మైనింగ్, లిక్కర్, గ్రానైట్, భూకబ్జాలు, ప్రభుత్వ భవనాలకు రంగులేయడం వంటి పనులతో దాదాపు 8.23లక్షల కోట్లు దోచుకున్నారని విమర్శించారు. ఉద్యోగులు, కాంట్రాక్టర్లు, విద్యార్థులు, ఆరోగ్యశ్రీ, ఫీజ్ రీఎంబర్స్‌మెంట్ల క్రింద 1.40లక్షల కోట్లు బకాయిలు పెట్టి రాష్ట్ర ఖజానాను దివాళా తీయించారన్నారు. కోట్ల రూపాయల విలువ చేసే భూములను బినామీ సంస్థలకు ధారాదత్తం చేశారన్నారు. 2014–19మధ్య జిడిపి 10.5శాతం ఉంటే జగన్ పాలనలో 5శాతానికి దిగువన పడిపోయిందన్నారు. 93శాతం స్ట్రైక్ రేట్‌తో ప్రజలు తెలుగుదేశం పార్టీని గెలిపించారన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీల అమలుకు సిఎం చంద్రబాబునాయుడు చిత్తశుద్ధితో కృషి చేస్తున్నారన్నారు. దావోస్ పర్యటనలో సైతం సిఎం చంద్రబాబు పలు సంస్థల అధినేతలను కలిసి ఆహ్వానించారని వారంతా అతిత్వరలోనే మన రాష్ట్రానికి వచ్చి పెట్టుబడులు పెట్టడం ఖాయమన్నారు. మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి భూకబ్జాలపై ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని సిఎం చంద్రబాబు ప్రజల నాయకుడు అని రాష్ట్ర బిసి సెల్ ఉపాధ్యక్షుడు కాణిపాకం వెంకటేష్ పేర్కొన్నారు. సమావేశంలో మాజీ ఎఎంసి ఛైర్మన్ సత్యేంద్రశేఖర్, రాష్ట్ర బిసిసెల్ ఉపాధ్యక్షుడు కాణిపాకం వెంకటేష్, కౌన్సిలర్ సోమశేఖర్, మాజీ సర్పంచ్ వల్లెప్ప, క్లస్టర్ ఇన్‌చార్జ్ ప్రతాప్, తెలుగుయువత అధ్యక్షుడు వెంకీ, ఐటిడిపి నేత వినోద్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా శ్రీ నల్లగంగమాంబ విగ్రహ ప్రతిష్ట.. కుంబాభిషేకం

కుప్పం, జనవరి 29 ప్రభాతవార్త



కుప్పం పాతపేట మునస్వామిపురంలో నూతనంగా నిర్మించిన శ్రీ నల్లగంగమాంబ అమ్మవారి నూతన విగ్రహ ప్రాణ ప్రతిష్ట కార్యక్రమాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. వేదబ్రహ్మశ్రీ బాలసుబ్రమణ్యం శాస్త్రి అధ్వర్యంలో ఈ సందర్భంగా మహాకుంబాభిషేకం, హోమాది కార్యక్రమాలు జరిపారు. అమ్మవారికి ఈసందర్భంగా విశేష పూజలు నిర్వహించారు. భక్తులకు మున్సిపల్ టిడిపి అధ్యక్షుడు రాజ్‌కుమార్ నేతృత్వంలో పెద్ద ఎత్తున అన్నదానం జరిపారు. కాగా అమ్మవారిని కడ ప్రాజెక్ట్ డైరెక్టర్ వికాస్ మర్మత్ దర్శించుకున్నారు. కార్యక్రమాల్లో మాజీ ఎంపిపి డా॥ వెంకటేష్, నేతలు సతీష్, సింధు, శారదమ్మ, తిరుమగళ్, స్థానికులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## మాజీ గంగమ్మగుడి ఛైర్మన్‌చే మహిళలకు చీరలు పంపిణీ

కుప్పంరూరల్, జనవరి 29 ప్రభాతవార్త



కుప్పం శ్రీ తిరుపతి గంగమాంబ ఆలయ మాజీ ఛైర్మన్ బిఎంకె రవిచంద్ర బుధవారం మున్సిపల్ పరిధి బాబునగర్ ప్రాంతంలో మహిళలకు ఉచితంగా చీరలు పంపిణీ చేశారు. తన కుమార్తె నైషి వివాహ రిసెప్షన్‌కు హాజరు కావాలని కోరుతూ ఆయన మహిళలకు చీరలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర నేతలు గోపీనాథ్, డా॥ బిఆర్ సురేష్‌బాబు పాల్గొన్నారు.

## స్మశాన వాటిక దారికై గ్రామస్తుల ధర్నా

– ఆర్డీఒను చుట్టుముట్టిన ప్రజలు!!

శాంతిపురం, జనవరి 29 ప్రభాతవార్త



మండలంలోని గుంజార్లపల్లి పంచాయతీ కరేగానూరు గ్రామస్తులు తమ గ్రామ స్మశాన వాటికకు వెళ్లే దారిని కొందరు ఆక్రమించడంతో మండల సచివాలయం ఎదుట ధర్నా చేపట్టారు. అక్కడకు చేరుకున్న ఆర్డీఓ శ్రీనివాసులు రాజును చుట్టుముట్టి సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కరేగానూరులో సుమారు డెబ్బై కుటుంబాలు ఉన్నాయని తమ తాత ముత్తాతల కాలం నుంచి దుంకుమానిపల్లి రెవెన్యూలో 2.20 ఎకరాల భూమి ఉందని ఇక్కడ నుంచే స్మశాన వాటికకు దారి ఉండగా దాన్ని కొందరు ఆక్రమించారని పేర్కొన్నారు. దీంతో స్పందించిన ఆర్డీఓ గ్రామానికి వెళ్లి సర్వే చేసి దారి వసతి కల్పించా లని తహశీల్దార్, ఎంపిడిఒలను ఆదేశించారు. అనంతరం అధికారులు గ్రామానికి చేరుకుని సర్వే చేసి దారి వసతి కల్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ జనార్ధనరెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు విశ్వనా థనాయుడు, మాజీ వైస్ ఎంపిపి ఉదయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. కాగా స్మశానం పక్కన గల కోట్ల విలువ చేసే భూమిని కొందరు ఆక్రమించినా పట్టించుకోకపోవడంలో ఆంతర్యమేంటని పలువురు పేర్కొం టున్నారు. ఆభూమినిప్రభుత్వంస్వాధీనంచేసుకునిప్రభుత్వఅవసరాలకు వాడుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

## రామకుప్పంలో ఎంఆర్‌పిఎస్ నేతల ర్యాలీ

**రామకుప్పం, జనవరి 29 ప్రభాతవార్త** మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి నేతలు బుధవారం రామకుప్పంలో ర్యాలీ నిర్వహించారు. ఎంఆర్‌పిఎస్ వ్యవస్థాపకులు మందకృష్ణ మాదిగకు ఇటీవలే ప్రభుత్వం పద్మశ్రీ పురస్కారం ప్రకటించడం పట్ల వారు హర్షం వ్యక్తం చేశారు. ఈసందర్భంగా మందకృష్ణ చిత్రపటాన్ని ఊరేగించారు. కార్యక్రమంలో ఎంఆర్‌పిఎస్ నేతలు వెంకటేష్, గోవిందప్ప, రాజ్‌కుమార్, ప్రకాష్, పాపన్న, సుబ్రమణ్యం, జయప్ప, తదితరులు పాల్గొన్నారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## మొగిలి అభివృద్ధికి ప్రత్యేక కమిటీ – కలెక్టర్ సుమిత్‌కుమార్



**బంగారుపాళ్యం, జనవరి 29 ప్రభాతవార్త:** స్వయంభూ శ్రీ మొగిలీశ్వరాల అభివృద్ధికి తాత్కాలికంగా ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేస్తున్నట్లు కలెక్టర్ సుమిత్‌కుమార్ చెప్పారు. బుధవారం కలెక్టర్ మొగిలీశ్వరాయలంను సందర్శించి మూల విరాట్ స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు కలెక్టర్‌కు పూర్ణకుంభంతో స్వాగతం పలికి ఆలయ చరిత్రను కలెక్టర్‌కు వివరించారు. అనంతరం ఆలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ ప్రసిద్ధి చెందిన మొగిలీశ్వరాలయ అభివృద్ధికి తాత్కాలిక కమిటీ ఏర్పాటుకు పూనుకున్నట్లు చెప్పారు. ఈ కమిటీకి ఛైర్మన్‌గా కలెక్టర్, సభ్యులుగా స్థానిక ఎమ్మెల్యే, ఎంపిడిఓ, ఆలయ ప్రధాన అర్చకులు, ఇతర సభ్యులు వుంటారన్నారు. ఆలయానికి సంబంధించి 4 కోట్ల రూపాయలు బ్యాంకులో డిపాజిట్ వుందని, ఆ డిపాజిట్‌కు బ్యాంకు చెల్లిస్తున్న వడ్డీ, ఇతర నిధులతో తాత్కాలిక మౌళిక వసతులను కల్పించడానికి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ముఖ్యంగా భక్తులకు తాగునీటి వసతి, మరుగుదొడ్ల ఏర్పాట్లు, సిసి కమెరాలు, విద్యుత్ లైట్లు, జనరేటర్ కొనుగోలు, ఆలయ పై రూఫ్ మరమ్మత్తులు చేపట్టనున్నట్లు చెప్పారు. అనంతరం కలెక్టర్ పూతలపట్టు ఎమ్మెల్యే డాక్టర్ కలికిరి మురళీమోహన్‌తో కలిసి దేవరకొండ జలకంఠేశ్వరస్వామిని దర్శించుకున్నారు. గో సంరక్షణ కేంద్రంను పరిశీలించారు. అలాగే టేకుమంద జడ్పీ హైస్కూల్‌ను కలెక్టర్ తనిఖీ చేశారు. విద్యార్థులు ఆట స్థలం కోసం కలెక్టర్‌ను కోరగా వెంటనే 2.34 ఎకరాల ఆట స్థలం కేటాయిస్తూ ప్రహరిగోడ నిర్మాణానికి రూ.10 లక్షలు మంజూరు చేశారు. ఈ కార్యక్రమాల్లో మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు జయప్రకాష్, కార్యదర్శి జనార్ధన్‌గౌడు, తహసిల్దారు రాజేంద్రప్రసాద్, ఎంపిడిఓ శ్రీధర్, అర్చకులు రెడ్డప్ప, విశ్వనాథ్, దండపాణి, శ్రీనివాసశర్మ, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

## మాస్టర్ ఆర్ట్ కాంపిటీషన్ గోల్డ్ మెడల్స్‌లో లిటిల్‌రోస్ హవా



**చిత్తూరురూరల్, జనవరి 29 ప్రభాతవార్త:** చిత్తూరు నగరం, గాంధీరోడ్డులోని లిటిల్‌రోస్ పాఠశాలకు చెందిన విద్యార్థులు మాస్టర్ ఆర్ట్ కాంపిటీషన్( ఎంఏసి) నిర్వహించిన హ్యాండ్‌రైటింగ్, కలరింగ్‌లలో 17 గోల్డ్‌మెడల్స్, 15 సిల్వర్ మెడల్స్‌సాధించారని లిటిల్ రోస్ కరస్పాండెంట్ డా.బి.గోపాలక్రిష్ణమూర్తి తెలిపారు. కాగా మెడల్స్ సాధించిన విద్యార్థిని, విద్యార్థులనుకరస్పాండెంట్‌తోపాటుడైరెక్టర్స్ డా. లోహిత్‌కుమార్, రాధిక, అకడమిక్‌ఇన్‌ఛార్జ్‌దుర్గశ్రీలుఅభినందించారు.

## విశ్రాంత ఉద్యోగులకు ఉచిత కంటి వైద్యశిబిరం

**చిత్తూరురూరల్, జనవరి 29 ప్రభాతవార్త:** చిత్తూరునగరంలోని పెన్షనర్ల భవనం నందు ఫిబ్రవరి 5వ తేది బుధవారం తిరుపతికి చెందిన అమెరికన్ లేజర్ ఐ ఆసుపత్రి వారిచే ఉచిత కంటి వైద్యశిబిరంను ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘ జిల్లా అధ్యక్షుడు కె.నాగరాజ తెలిపారు. ఈ శిబిరంలో కంటి పరీక్షలు నిర్వహించి, ఆపరేషన్‌కు ఎంపికైన వారిని అదే రోజు ఆసుపత్రికి తీసుకెళ్లి ఉచితంగా ఆపరేషన్ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కంటి పరీక్షలకు హాజరు అయ్యే ప్రతి ఒక్కరు తమ వెంట హెల్త్ కార్డు, ఆధార్‌కార్డులను తప్పక తీసుకొని రావాలని, జిల్లాలోని విశ్రాంత ఉద్యోగులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

## ఆయుస్మాన్ భారత్ కార్డులతో బహుళ ప్రయోజనాలు : డాక్టర్ పవన్

చౌడేపల్లి, జనవరి 29 ప్రభాతవార్త



ఆయుస్మాన్ భారత్ కార్డులతో బహుళ ప్రయోజనాలున్నాయని మండల వైద్యాధికారి డాక్టర్ పవన్‌కుమార్ అన్నారు. స్థానిక ఆరోగ్య కేంద్రంలో పలవురికి ఎబీ కార్డులను నమోదు చేసారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఏబీకార్డుల ద్వారా అనేక ఉపయోగాలున్నాయన్నారు. ఈ కార్డులద్వారా దేశంలోని ఏ రాష్ట్రంలో అయినా రూ. 5లక్షల వరకు ఉచితంగా వైద్యం పొందవచ్చునన్నారు. తమిళనాడు, కర్ణాటక, తెలంగాణా రాష్ట్రాల సరిహద్దుల్లో వున్నాయి కాబట్టి ఏబీ కార్డు పొందితే ఉపయుక్తంగా వుటుందన్నారు. సచివాలయాల పరిధిలోని విలేజ్ క్లినిక్‌లలో గల ఎంఎల్‌హెచ్‌పి, ఎఎన్ఎంను సంప్రదించి కార్డులు పొందవచ్చునన్నారు. ఆధార్‌కార్డుకు సంధానమైన మొబైల్ ఫోన్, ఆధార్‌ను తీసుకొని సంప్రదించాలన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు వినయోగించుకోవాలని పిలుపునిచ్చారు. డాక్టర్ పూజ, నవీన్‌లు హాజరయ్యారు.

## రాష్ట్రషస్థాయి కబడ్డీ పోటీల్లో ప్రతిభ కనబరచిన చౌడేపల్లి బాలికలు



**చౌడేపల్లి, జనవరి 29 ప్రభాతవార్త** విశాఖ జిల్లా చోడవరం మండలం అంకుపాళెంలో జరిగిన అంతర జిల్లాల కబడ్డీ పోటీల్లో చౌడేపల్లి ఉన్నత పాఠశాల బాలికలు ప్రతిభను కనబరచారు. రాష్ట్రస్థాయిలో జరిగిన పోటీలందు తృతీయస్థానాన్ని కైవశం చేసుకొన్నారు. స్థానిక ఉన్నతపాఠశాలలో 9వ తరగతికి చెందిన రూప, సుమతిలు జట్టు గెలుపులో ప్రధాన భూమికను పోషించినట్లు పిఈటి రాజేంద్ర తెలిపారు. బాలికలను ప్రధానోపాధానోపాధ్యాయుడు నాగరాజరెడ్డి, ఉపాధ్యాయులు మురళి, ఈశ్వర్, ఆనంద, సుధాకర్, పరిమళ, స్థానికులు అభినందించారు.

## పరిసరాల శుభ్రతతో అంటు వ్యాధులకు దూరం

చౌడేపల్లి, జనవరి 29 ప్రభాతవార్త



పరిసరాల శుభ్రతతో అంటు వ్యాధులకు దూరంగా వుండవచ్చునని వైద్యాధికారి పవన్‌కుమార్ అన్నారు. స్థానికంగల ఎస్సీ బాలికలు, బాలుర వసతి గృహాల్లో ఆరోగ్య వైద్య శిబిరాలు ఏర్పాటు చేసారు. పిల్లలకు వైద్య పరీక్షలు నిర్వహించి, మందులు పంపిణీ చేసారు. వ్యక్తిగత శుభ్రత పాటించాలనీ, పౌష్టికాహారాన్ని క్రమం తప్పకుండా తీసుకోవాలన్నారు. దోమలు, ఈగల వల్ల వచ్చే వ్యాధులు, చలికాలంలో పాటించాల్సిన ఆరోగ్య సూత్రాలను వివరించారు. సూపర్‌వైజర్ బాహుద్దీన్, ఆరోగ్య సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## 3న కాణిపాకంలో శ్రీమహాసరస్వతి యాగము

**కాణిపాకం, జనవరి 29 ప్రభాతవార్త:** మాఘ శుద్దపంచమి (వసంత పంచమి) సందర్భంగా సత్య ప్రమాణాల దేవుడు కాణిపాకం శ్రీవినాయకుని చెంత ఫిబ్రవరి 3న శ్రీమహాసరస్వతి యాగమును నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ కె.పెంచల కిషోర్ తెలిపారు. దేవస్థానం ఆస్థాన మండపంలో ఉదయం 9 గంటలకు ఈయాగమును అర్చకులు, వేదపండితులు శాస్త్రోక్తంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈఏడాది 10వ తరగతి పరీక్షలకు హాజరగు విద్యార్థిని విద్యార్థులు హాజరయ్యే విధంగా స్థానిక ఎమ్మెల్యే కలికిరి మురళీమోహన్ సమక్షంలో జరిగే ఈయాగానికి విద్యార్థిని విద్యార్థులు పెద్దఎత్తున తరలివచ్చి స్వామివారి కృపకు పాత్రులు కావాలని కోరారు. యాగములో పాల్గొనే విద్యార్థులకు దేవస్థానం తరపున విద్యార్థులకుఉపయోగపడేవస్తువులు, ప్రసాదములను అందజేయనున్నట్లు ఈఓ పెంచల కిషోర్ తెలిపారు.

## వాడ వాడల్లో సిపాయి జన్మదిన వేడుకలు

ఎప్పటికి నిరుపేదల సేవకు ప్రాధాన్యం: సిపాయి

శ్రీకాళహస్తి,జనవరి 29 ప్రభాతవార్త

శ్రీకాళహస్తి ప్రజలకు ఎప్పుడూ అందుబాటులో ఉంటూ వారికి వైద్యసేవలు అందించుటకు సిద్ధంగా ఉంటానని డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం అన్నారు. బుధవారం ఆయన జన్మదినం సందర్భంగా వాడ వాడల్లో సామాజిక కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. శ్రీకాళహస్తికి చెందిన వస్త్రాల కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ సామిరెడ్డి భరత్‌రెడ్డి,ప్రముఖ పారిశ్రామిక వేత్త పెరుమాళ్‌రెడ్డి సారథ్యంలో అన్నదానాలు అందించారు. పట్టణంలోని వైయస్ఆర్ విగ్రహం వద్ద భారీ ఎత్తున అన్నదాన కార్యక్రమాలను ఏర్పాటు చేసారు.ఈ కార్యక్రమాల్లో మాజీ శాసనసభ్యుడు బియ్యపు మధుసూధనరెడ్డి హాజరయ్యారు. కాగా మార్కెటింగ్ కమిటి సమీపంలో అన్నదానం ఏర్పాటు చేసారు.సామిరెడ్డి భరత్‌రెడ్డి సారథ్యంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వద్ద కేక్ కట్ చేసి పేదలకు దుస్తులను అభిమానులకు అందజేసారు. పెరుమాళ్ రెడ్డి సారథ్యంలో ప్రభుత్వ కూడలి వద్ద రోగులకు పాలు పండ్లు,రొట్టెలు అందించారు.ఈ కార్యక్రమాల్లో ఉన్నం వాసుదేవనాయుడు, రత్నంరెడ్డి, బుజ్జిరెడ్డి, లక్ష్మీపతి రెడ్డి, మాజీ కౌన్సిలర్ కంఠా ఉదయకుమార్,వడ్లగాంగ్ బాలాజీప్రసాదరెడ్డి, కృష్ణారెడ్డి జబాజ్ మురళిరెడ్డి, జీవీకే రెడ్డి, హరినాయుడు,పఠాన్‌ఫరీద్‌ఖాన్,అభిమానులు పాల్గొన్నారు.

## పోలీసు చట్టాలపై విద్యార్థులకు అవగాహన



తిరుపతికార్పొరేషన్, జనవరి 29ప్రభాతవార్త:

సమాజంలో పోలీసుల పనితీరు, చట్టాలపై, నేరాలు జరుగుతున్న తీరు, నియంత్రణ విషయాలపై తిరుపతి పోలీసులు విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నారు. బుధవారం ఎస్‌డిహెచ్ఆర్ కళాశాలలో విద్యార్థులకు సైబర్‌క్రైమ్స్, యువతులు, మహిళలపై జరుగుతున్న నేరాలు, రక్షణపై తదితర విషయాలపై వెస్ట్‌మహిళ రక్షక్ మహిళ సిఐ తమీమ్‌అహ్మద్, ఎస్ఐ గిరిజ ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు.

## బోర్లు, మోటార్లు మరమ్మత్తులు చేసి ప్రజలకు సమృద్ధిగా నీరు అందించాలి

కమిషనర్ ఎన్. మౌర్య

తిరుపతికార్పొరేషన్, జనవరి 29ప్రభాతవార్త:



త్రాగునీరు అందించే బోర్లు, మోటార్లు మరమ్మత్తులు చేసి ప్రజలకు సమృద్ధిగా నీరు అందించాలని కమిషనర్ ఎన్. మౌర్య అధికారులను ఆదేశించారు. బుధవారం నగరంలో 48, 49 వార్డులైన జీవకోన, రాజీవ్ గాంధీ కాలనీ, రాఘవేంద్ర కాలనీ, లెప్రసి కాలనీ కూరపాటి లేఔట్ తదితర ప్రాంతాల్లో కార్పొరేటర్లు అన్నా అనిత, అన్నా సంధ్య అనిల్ కుమార్, ఆరోగ్య శాఖ, ఇంజనీరింగ్ టౌన్ ప్లానింగ్ అధికారులతో కలిసి తనిఖీ చేశారు. పలు చోట్ల నీరు రావడం లేదని పారిశుద్ధ్య పనులు మరింత మెరుగ్గా చేపట్టాలని ప్రజలు కోరారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలో త్రాగునీటి ఎద్దడి తలెత్తకుండా బోర్లు, మోటార్లు మరమ్మత్తులు చేయించాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. అలాగే మురుగు కాలువలు లేకుండా ఉన్న ప్రాంతాల్లో నూతనంగా ఏర్పాటు చేసేందుకు మరమ్మత్తులు చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని అన్నారు. శ్మశానం శుభ్రంగా ఉంచాలని, గేట్ ఏర్పాటు చేసి ఆకతాయిలు రాకుండా పటిష్ట ఏర్పాటు చేయిస్తామని అన్నారు. ప్రజలకు పారిశుద్ధ్యంపై అవగాహన కల్పించాలని పారిశుద్ధ్య సబ్బందిని ఆదేశించారు.

## జగనన్న కాలనీ పేరుతో ఇసుక దోపిడీ

**విజయపురం, జనవరి 29 ప్రభాతవార్త:** జగనన్న కాలనీ పేరుతో ఇసుక దోపిడీ జరుగుతుందని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. మండలంలోని నారపరాజుకండ్రిగలో జగనన్న కాలనీలో సుమారు 30 వరకు ఇళ్లు మంజూరు చేశారు. కానీ పది గృహాలు కూడా నిర్మాణం ప్రారంభం కాలేదు. కానీ ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో పక్కా గృహ నిర్మాణం అంటూ ప్రతిరోజు పర్మిట్ తీసుకుంటూ నారపరాజుకండ్రిగను దాటుకుని మామిడి తోపుల్లో ఇసుక డంప్ చేసుకుని అక్కడ నుంచి రాత్రి సమయాల్లో తమిళనాడుకు తరలిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. మండలంలోని కేవీ శ్రీరామపురం కుశస్థలీనది నుంచి ప్రతి రోజు ఇసుక తరలిస్తున్నారని, కొందరు నేరుగా తమిళనాడు సరిహద్దులకు ఇసుక సరఫరా చేస్తున్నారని ఫిర్యాదులు అందుతున్నాయి. ప్రభుత్వ ఆశయానికి తూట్లు ప్రతి ఒక్కరికి ఇసుక ఉచితంగా అందాలని సీఎం చంద్రబాబు దృఢ సంకల్పంతో నిర్ణయం తీసుకుంటే ఆయన ఆశయాలకు తూట్లు పొడుస్తూ కొందరు వ్యాపారం సాగిస్తున్నారని స్థానికులు ఆరోపణలు చేస్తున్నారు. ట్రక్కు ఇసుకను ఆంధ్ర సరిహద్దు ప్రాంతంలోరూ.4 వేలు నుంచి 5 వేల వరకు విక్రయిస్తున్నారని, తమిళనాడులో ట్రక్కు ఇసుక రూ.6 వేలు నుంచి 7500 వరకు విక్రయిస్తున్నారని, వీటిపై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

## ప్రజాధనాన్ని జల్సాలు చేసిన జగన్

**పలమనేరు,జనవరి 29,ప్రభాతవార్త:**

ప్రజాధనం రూ.10లక్షల కోట్లను జగన్ జల్సాలకు వినియోగించారని పలమనేరు ఎమ్మెల్యే అమరనాథరెడ్డి ఆరోపించారు.స్థానిక ఎమ్మెల్యే కార్యాలయంలో బుధవారం ఆయన మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి గత ఐదు సంవత్సరాలలో 10 లక్షల కోట్ల అప్పు చేసి ఆర్థిక వ్యవస్థ దివాలా తీసే పరిస్థితికి తీసుకువచ్చారని ఆరోపించారు.గడిచిన 7 నెలలలో ఆరోగ్యశ్రీ,ధాన్యం బకాయిలు,పీజు రాయంబర్స్‌మెంట్ లాంటి జగన్ ప్రభుత్వ బకాయిలు రూ.22 వేల కోట్లను చంద్రబాబు ప్రభుత్వం చెల్లించిందన్నారు.అప్పులు కూడా పుట్టని స్థితి రాష్ట్రంలో ఏర్పడిందని ఏడాదికి రూ.71వేల కోట్లు ఆసలు,వడ్డీ చెల్లించాల్సి వస్తోందని తెలిపారు.ప్రభుత్వ ఆదాయం పెంచే సాగునీటి ప్రాజెక్టులు,అమరావతి నిర్మాణం లాంటి వాటిపై కాకుండా వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి విలాసాలు,జల్సాలకు ఖర్చు పెట్టుకోవడం దారుణమన్నారు.తన ఐదేళ్ల అధికారాన్ని అడ్డం పెట్టుకొని వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్షల కోట్లు ప్రజాధనాన్ని కొల్లగొట్టారని భూ కేటాయింపులు,గనుల తవ్వకాలు,సోలార్ అనుమతులు ఇలా ప్రతి అంశంలో పక్షపాతానికి ఒడిగట్టి లక్షల కోట్లు సంపాదించారని ఆరోపించారు.గత ప్రభుత్వ అనాలోచిత నిర్ణయాలతో రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ దివాలా తీసిందని ప్రస్తుత ప్రభుత్వానికి పెనుభారమైమారిందని తెలిపారు.ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ రహదారి పనులు పూర్తికి చర్యలు

పనపాకం వద్ద సర్వే పరిశీలించిన ఆర్డీఓ



*చంద్రగిరి, జనవరి 29 ప్రభాతవార్త:* జాతీయ రహదారి పూతలపట్టు – నాయుడుపేట పనపాకం వద్ద పెండింగ్‌లో వున్న పనులను వచ్చే నెల నుండి ప్రారంభించి పూర్తి చేయనున్నట్లు ఆర్‌డిఓ రామ్మోహన్ తెలిపారు. భూసేకరణ సమయంలో తలెత్తిన సమస్యల కారణంగా బుధవారం ఆయన రెవెన్యూ అధికారులతో సర్వే చేయించారు. రైతులకు జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్ పరిహారం చెల్లించడంతో సమస్య పరిష్కారం అయ్యిందన్నారు. ఈ క్రమంలో రోడ్డు పనులకు ఇబ్బందులు లేనట్లయితే రెండు వారాల్లో పనులు ప్రారంభించి పూర్తి చేయతలపెట్టినట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ శివరామసుబ్బయ్య, సర్వేయర్ సురేష్‌బాబు, ఆర్ఐభాస్కర్, విఆర్ఓ ధనంజయవర్మ, విఆర్ఎ బాలసుబ్రమణ్యం, తదితరులు పాల్గొన్నారు.

## నకిలీ నమోదు ప్రక్రియకు స్వస్తి..!



ఆర్‌డిఓ రామ్మోహన్

చంద్రగిరి, జనవరి 29 ప్రభాతవార్త: ప్రతి పాఠశాలలో విద్యార్థుల హాజరుపై నకిలీ నమోదు ప్రక్రియకు స్వస్తి పలకాలని ఆర్‌డిఓ రామ్మోహన్ అన్నారు. స్థానిక రెవెన్యూ కార్యాలయంలో బుధవారం మండల పరిధిలోని క్లస్టర్ ఎంఈఓలు, హెచ్ఎంలతో ఆయన సమావేశం నిర్వహించారు. విద్యార్థుల నమోదు ప్రక్రియలో ఏవైనా లోపాలు వున్నట్లయితే వాటిని డ్రాప్ బాక్స్‌లో పెట్టవలసినదిగా ఆదేశించారు. పాఠశాల పనిదినాలు, రిజిస్టర్‌లో విద్యార్థుల హాజరుపై వ్యత్యాసాలు రాకూడదన్నారు. ప్రతి ప్రధానోపాధ్యాయుడు క్లస్టర్ స్కూల్‌కు వెళ్ళి డిక్లరేషన్‌ను అందజేయాలని అన్నారు. ఈ సమావేశంలో ఎంఈఓ శ్రీవరం లలితకుమారి, ఎంఈఓ -2 భాస్కర్‌బాబు, హెచ్ఎంలు వెంకటరమణరెడ్డి, విజయ, తదితరులు పాల్గొన్నారు.

## ఈవ్ టీజింగ్ జరగకుండా చర్యలు...

రేణిగుంట జనవరి 29 ప్రభాతవార్త



రేణిగుంట మండలం రూరల్ సర్కిల్ గాజుల మండ్యం పోలీస్ స్టేషన్ పరిధిలోని అన్ని విద్యాసంస్థల వద్ద తిరుపతి ఎస్పీ హర్షవర్ధన్ రాజు ఆదేశాల మేరకు రేణిగుంట డీఎస్పీ శ్రీనివాసరావు పర్యవేక్షణలో రూరల్ సీఐ మురళీకృష్ణ, గాజుల మండ్యం ఎస్సై సుధాకర్ నేతృత్వంలో రూరల్ పోలీసులు ఈవ్ టీజింగ్ జరగకుండా బుధవారం నుండి కట్టుదిట్టమైన చర్యలు చేపట్టారు. విద్యా సంస్థల పరిసర ప్రాంతాల్లో వాహనాలను తనిఖీ చేశారు. డ్రంక్ అండ్ డ్రైవ్ చేయకుండా కఠిన చర్యలు తీసుకున్నారు. వాహనాలను నడిపేటప్పుడు అందుకు సంబంధించిన డ్రైవింగ్ లైసెన్సులు, రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. ముఖ్యంగా విద్యాసంస్థల వద్ద ఆకతాయిలా ఆగడాలను అరికట్టడానికి మఫ్టీలో పోలీసులను నియమించారు.

## పింఛన్ లబ్ధిదారుల అర్హత గుర్తింపు

వడమాలపేట, జనవరి 29 ప్రభాతవార్త:



ప్రభుత్వం ద్వారా పింఛన్ లబ్ధిదారుల అర్హత గుర్తింపు కోసం క్షేత్ర స్థాయిలో అధికారులు పరిశీలించి విచారణ నిర్వహించారు. బృందం వైద్యులు పింఛన్ దారుల ఆరోగ్యపరిస్థితులపై వారి వారి ఇళ్ళ వద్ద జీపీఎస్ పద్ధతి ద్వారా పరిశీలించారు. మండలంలో 34 మంది 15 వేల చొప్పున ఆరోగ్య పింఛన్‌లు ప్రభుత్వం ద్వారా పొందుతున్నారు. దీనిపై ప్రభుత్వ ఆదేశాల మేరకు మంగళ, బుధ వారాల్లో ప్రత్యేక బృందం ప్రత్యక్షంగా పరిశీలించారు. పూర్తి స్థాయి నివేదిక జిల్లా కలెక్టర్‌కు పంపుతున్నట్లు అసిస్టెంట్ ప్రొఫెసర్‌లు రవిబాబు, సునీల్ బాబులు తెలిపారు. పరిశీలనలో పీహెచ్‌సీ వైద్యాధికారి చక్రపాణి, వెలుగు ఏపీఎం వైజర్ చంద్రమోహన్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## గీత కార్మికులకు మద్యం షాపులు

-నేటి నుంచి దరఖాస్తులకు ఆహ్వానం



తొట్టంబేడు, జనవరి 28 ప్రభాతవార్త

రాష్ట్ర ప్రభుత్వం మద్యం దుకాణాలకు గీత కార్మికులకు మద్యం దుకాణాలు కేటాయించాలన్న నిర్ణయం మేరకు శ్రీకాళహస్తి ఎక్సైజ్‌శాఖ డివిజన్ పరిధిలో ఎక్సైజ్‌శాఖ డిప్యూటీ కమిషనర్ విజయశేఖర్ తెలిపారు. బుధవారం ఏర్పాటుచేసిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడుతూశ్రీకాళహస్తి మున్సిపాలిటీ, తొట్టంబేడు, కెవిబిపురం, శ్రీఖాళహస్తి రూరల్‌లో ఒక్కొక్క షాపు చొప్పున నాలుగు దుకాణాలను కేటాయించినట్లు తెలిపారు.గీత కులస్తులు మాత్రమే దరఖాస్తు చేసుకునేందుకు అర్హులని స్పష్టం చేశారు. నేటి నుంచి ఫిబ్రవరి 5వ తేదీ సాయంత్రం లోపు దరఖాస్తులను ఆన్‌లైన్ ద్వారా కానీ లేదా ఎక్సైజ్ కార్యాలయంలో నేరుగా చేసుకోవచ్చని తెలిపారు. రూ.2లక్షలు ఆన్ రీఫండబుల్ చెల్లిస్తేనే అప్లికేషన్ డౌన్‌లోడ్ అవుతుందని వచ్చేనెల 7వ తేదీన కలెక్టరేట్‌లో దరఖాస్తు చేసుకున్న వారి ఆధ్వర్యంలో లాటరీ సిస్టంలో ఎంపిక చేయడం జరుగుతుందని ఆయా కులస్తులు తగిన చొరవచూపి ప్రభుత్వం కల్పించిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎక్సైజ్ సిఐ లావణ్య తదితరులు పాల్గొన్నారు.

## బహిరంగ ప్రదేశాల్లో మద్యపానం నిషేదం

తొట్టంబేడు, జనవరి 29 ప్రభాతవార్త



బహిరంగ ప్రదేశాల్లో మద్యపానం నిషేధం అని డిఎస్పీ నరసింహామూర్తి అన్నారు. బుధవారం డిగ్రీ కళాశాల క్రీడామైదానంలో ఉన్న ఖాళీ స్థలంలో ఓపెన్ బూజింగ్ జరిగి అక్కడి ప్రాంతంతా చెత్తాచెదారంతో మున్సిపల్ సిబ్బందితో తొలగించి అక్కడ హెచ్చరిక బోర్డులు మరియు సైబర్ క్రైంకు సంబందించి అవగాహన కార్యక్రమం కల్పించారు. కార్యక్రమంలో డిఎస్పీ నరసింహామూర్తితో పాటు డిగ్రీ కళాశాల విద్యార్ధులుచ ఈవినింగ్ వాకర్స్ కార్యక్రమంలో టుటౌన్ సిఐ వెంకటేశులు, ప్రిన్సిపల్ నాగరాజునాయుడు తదితరులు పాల్గొన్నారు.

## కొండ్రాజుపల్లిలో వైద్యశిబిరం

తొట్టంబేడు, జనవరి 29 ప్రభాతవార్త



మండలంలోని కాసరం పంచాయతీ కొండ్రాజుపల్లిలో బుధవారం కాసరం పిహెచ్‌సి వైద్యులు మాధవుడు, తేజేశ్వరిల ఆధ్వర్యంలో వైద్యశిబిరాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా గ్రామంలో 48 మందికి రోగులకు చికిత్స చేశారు. వీరిలో పురుషులు 13, మహిళలు 35 మందికి చికిత్స చేసి మందులు అందించారు. వీరిలో ఒక ఫీవర్ కేసు రాగా, మంచానికి పరిమి తమైన రోగులు 2, సికెడి రోగులు ముగ్గురు ఉన్నట్లు గుర్తించామన్నారు. మొత్తం 188 మంది ప్రజలు ఉన్న గ్రామంలో 45 గృహాలు ఉన్నాయని ఇంటింటా సర్వే నిర్వహించి ఫీవర్ కేసులను గుర్తిస్తామని వారికి అవసరమైన వైద్యసేవలు అందిస్తామన్నారు. కార్యక్రమంలో వైద్యులతో పాటు సూపర్‌వైజర్లు, ఎఎన్ఎంలు, ఆశావర్కర్లు, ఎంఎల్‌హెచ్‌పిలు పాల్గొన్నారు. కాగా ఇక్కడ గ్రామంలో పూర్తిగా జ్వరాలు తగ్గేవరకు వైద్యశిబిరం నిర్వహిస్తామని అనంతరం సమీపంలోని పిల్లమేడులో వైద్యశిబిరం నిర్వహిస్తామన్నారు.

## కల్లుగీత కార్మికులకు మద్యం దుకాణం

ఎర్రావారి పాళ్యంలో కేటాయింపు, ఎక్సైజ్ సిఐ కె.వి.ఎస్.ఫణీంద్ర

చంద్రగిరి, జనవరి 29 ప్రభాతవార్త:

చంద్రగిరి ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో కల్లుగీత కార్మికులకు ఎర్రావారిపాళ్యం మండలంలో కేటాయించినట్లు ఎక్సైజ్ సిఐ కె.వి.ఎస్.ఫణీంద్ర బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ దుకాణం ఈడిగ కులానికి కేటాయించినట్లు పేర్కొన్న ఆయన తిరుపతి జిల్లాకు చెందిన ఈడిగ కులస్థులు మాత్రమే దరఖాస్తు చేసుకునేందుకు అర్హత వున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన వ్యక్తులు తిరిగి చెల్లించబడని రూ.2 లక్షలు దరఖాస్తు రుసుమును చలానా లేదా డిడి రూపంలో చెల్లించాలని అన్నారు. అదేవిధంగా కుల ధృవీకరణ, స్థానికతకు సంబంధించిన సర్టిఫికెట్లను తహశీల్దార్ ద్వారా మంజూరు చేయబడినవి జతచేయాలన్నారు. ఫిబ్రవరి 5న సాయంత్రం 5 గంటల లోపు చంద్రగిరి ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్‌లో సమర్పించాలని కోరారు. మరింత సమాచారం కోసం తమ కార్యాయంలో పనివేళల్లో సంప్రదించాలని కోరారు.

## రామానుపల్లిలో చురుగ్గా అభివృద్ధి పనులు

తిరుపతిరూరల్, జనవరి 29 ప్రభాతవార్త:



తిరుపతిరూరల్ మండలం రామానుజపల్లి గ్రామ పంచాయతీలో అభివృద్ధి పనులు చురుగ్గా కొనసాగుతున్నాయి. పంచాయతీ పరిధిలోని ఉద్యోగనగర్‌లో రూ.7లక్షల రుపాయాల ఎన్ఆర్ఇజిఎస్ నిధులతో సి.సి.రోడ్డు పనులు చేపట్టారు. స్థానిక ఎమ్మెల్యే పులివర్తి నాని సహకారంతో సి.సి, రోడ్లు వేస్తున్నట్లు తెలిపారు. ఇదివరకే రామానుజపల్లిలో భూ గర్భడ్రైనేజ్ వ్యవస్థను ఏర్పాటు చేసి ఆదర్శంగా నిలిపారు. స్మశానవాటిక పరిరక్షణకు ఇనుప కంచెను ఏర్పాటు చేయించారు. అలాగే నీటి శుద్ధి కేంద్రం వద్ద ప్రభుత్వ భూమి అన్యాక్రాంతం కాకుండా ప్రహరి ఏర్పాటు చేయిస్తున్నారు. మిగిలిన రోడ్లను కూడా త్వరా సిసి రోడ్లు వేయనున్నట్లు టిడిపి నాయకులు మునిరత్నం తెలిపారు. ఈ కార్యక్రమంలో రామానుజపల్లి సర్పంచ్ పొట్టేలి లీలరాణి రవికుమార్, మోహన కృష్ణ, ఇంజనీరింగ్ అసిస్టెంట్ ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

## కళలను ప్రోత్సహించాలి: కళాకారులను ఆదుకోవాలి

మాజీ మున్సిపల్ చైర్మెన్

శ్రీకాళహస్తి, జనవరి 29 ప్రభాతవార్త



ప్రభుత్వాలు కళలకు చేయూత ఇవ్వాలని కళాకారులను ఆదుకోవాలని మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ సొసైటీ ఫర్‌ఇంటిగ్రేటెడ్ డెవలప్‌మెంట్ ఆఫ్ ట్రైబల్స్ సొసైటీ అధ్యక్షుడు తీగల చంద్రశేఖర్ పిలుపు నిచ్చారు. బుధవారం గిరిజన గురుకుల పాఠశాలలో సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమాలకు గురుకులం ప్రిన్సిపల్ వై.దామోదర్‌నాయుడు అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిధిగా పాల్గొన్న చంద్రశేఖర్ మాట్లాడుతూ గతంలో ప్రభుత్వం కళలకు ప్రత్యేక ప్రాధాన్యత ఇచ్చే వారని కళాకారులను ఆదుకొనుటకు ప్రత్యేక పథకాలు ప్రకటించేదన్నారు. ఆ నాయకుడే నేడు కూటమి అధినేతగా రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఉన్నారని వివరించారు. గిరిజన కళాకారులను విద్యార్థి స్థాయి నుంచి ప్రోత్సహించాలన్నారు. కళలు సామాజిక దిక్సూచిలని, కళాకారులు దేశ సమగ్రతను చాటుతాయని సమైక్యతకు కృషి చేస్తారని వివరించారు. రాష్ట్ర ప్రభుత్వ సాంస్కృతిక సమితి భాషా, సాంస్కృతిక శాఖ సౌజన్యంతో గిరిజన సంఘాల సారధ్యంలో కార్యక్రమాలు ఏర్పాటు చేయటం హర్షణీయం అన్నారు. మరో ముఖ్య అతిధి శంకర్ స్వామి చిన్నారి కళాకారులకు ఆశీస్సులందించారు. ఈ సందర్భంగా సంధ్యాగ్రూప్, సారిక గ్రూప్, నేహశ్రీ, స్రవంతి, మస్తానమ్మ, కవిత, కౌముది గ్రూపులకు సంబంధించిన కళాకారులు వివిధ సాంస్కృతిక నృత్య ప్రదర్శనలతో ఆకట్టుకున్నారు. కళాకారులకు బహుమతులతో పాటు ధృవీకరణపత్రాలను అందించారు.

## భరద్వాజతీర్థంలో అన్నదానం

శ్రీకాళహస్తి, జనవరి 29 ప్రభాతవార్త



.తై అమావాస్య సందర్భంగా బుధవారం భరద్వాజతీర్ధంలో స్వామిఅమ్మవార్ల దర్శనానికి విచ్చేసిన భక్తులకు సత్యవ్రత భాస్కర అన్నదాన ట్రస్టు వారిచే అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో సంస్థ సభ్యులు గరికపాటిరమేష్‌బాబు, గరికపాటి సుధాకర్ బాబు గరికపాటిచంద్రశేఖర్, గరికపాటి రమేష్, జగదీష్, భాస్కర్, రామకృష్ణ, లోకేష్ తదితరులు పాల్గొన్నారు. కాగా 23వ వార్డు కొండమిట్ట వినాయస్వామి ఆలయం వద్ద మాఘ తై అమావాస్య సందర్భంగా గౌరీపూజను నిర్వహించారు.

## స్వామి అమ్మవార్ల గ్రామోత్సవం

శ్రీకాళహస్తి, జనవరి 29 ప్రభాతవార్త



శ్రీకాళహస్తీశ్వరాలయంలో బుధవారం తై అమావాస్య సందర్భంగా ఉదయం నుంచి లోబావిలో పూజలు, అబిషేకాలు జరిపిన తరువాత స్వామి అమ్మవార్లను బ్రహ్మగుడి వద్దకు తీసుకు వచ్చారు. అక్కడ విశేష పూజలు, హారతులిచ్చి బూడిదమిట్ట వాసులతో పాటు ఆలయానికి వచ్చిన దూర ప్రాంతపు భక్తులు స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు. తరువాత బోయిలు మోసుకుంటూ స్వామి అమ్మవార్లను వాహనాల మండపం వద్దకు చేర్చి అక్కడ హారతులిచ్చి గ్రామోత్సవం నిర్వహించారు. ఈ ఉత్సవంతో బ్రహ్మోత్సవాల సందడి చోటు చేసుకుంది.

## గంజాయి పట్టివేత: ఇద్దరు యువకులు అరెస్టు

శ్రీకాళహస్తిరూరల్, జనవరి 29 ప్రభాతవార్త



శ్రీకాళహస్తి నియోజకవర్గంలోని ఏర్పేడు మండలం నుంచి అక్రమంగా రవాణా జరుగుతున్న ఇద్దరిని అరెస్టు చేసి వారి నుంచి సుమారు 5కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు రేణిగుంట డివైయస్‌పి వై.శ్రీనివాస రావు తెలిపారు. బుధవారం ఏర్పేడు మండల కేంద్రంలోని పోలీసు స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వివరించారు. తిరుపతి జిల్లా ఎస్‌పి వి.హర్షవర్ధన్ రాజు సూచనలతో గంజాయి అక్రమరవాణాపై దృష్టి సారించినట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో మేర్లపాక దళితవాడ వద్ద ఇద్దరు యువకులు అనుమానాస్పద స్థితిలో సంచరిస్తుండగా అదుపులో తీసుకొని విచారించగా వారి వద్ద ఉన్న ఒక ప్లాస్టిక్ బ్యాగులో 4,935కిలోల గంజాయి ఉన్నట్లు గుర్తించామన్నారు. పట్టుబడిన వారు ఆనకాపల్లి రైల్వే స్టేషన్ సమీపంలో గుర్తుతెలియని వ్యక్తుల నుంచి కొనుగోలు చేసినట్లు వాటిని చిన్న చిన్న పొట్లాలు కట్టి శ్రీకాళహస్తిలోని పలు ప్రాంతాల్లో విక్రయిస్తున్నట్లు వివరించారన్నారు. నిందితులను అదుపులో తీసుకోవటంలో విశేష ప్రతిభను ఏర్పేడు ఎస్.జయచంద్ర వారి సిబ్బంది డివైయస్‌పి అభినందించారు.

## ద్విచక్రవాహనాలు సీజ్ - నిందితుడు అరెస్టు : డియస్‌పి

కార్వేటినగరం, జనవరి 29 ప్రభాతవార్త:





జల్సాలకు కోసం ద్విచక్ర వాహనాలను చోరీ చేస్తూ పట్టుబడ్డ సంఘటన కార్వేటినగరం సర్కిల్ పరిధిలో చోటు చేసుకున్నట్లు నగరి డియస్‌పి సయ్యద్‌అజీజ్ తెలిపారు. సర్కిల్ పరిధిలోని వెదురుకుప్పం మండలం తిరుమలయ్యపల్లి పంచాయితి పరిధిలోని వావిల్‌చేను గ్రామానికి చెందిన సుబ్రమణ్యం కుమారుడు వై.చంద్రబాబు వృత్తిరీత్యా స్కూటర్ మెకానికల్ . అయితే శ్రమపడకుండా జల్సాల కోసం సర్కిల్ పరిధిలోని ప్రభుత్వ కార్యాలయాల ఆవరణలో వుంచిన ద్విచక్రవాహనాలను టార్గెట్ చేస్తాడు. నిందితుడు అతని సొంత స్కూటర్‌లో ఆ ప్రాంతానికి వచ్చి తన వాహనాన్ని అక్కడే వుంచి మరో వాహనాన్ని చోరీ చేసి తక్కువ డబ్బులకు విక్రయించి జల్సాలకు పాల్పడేవాడు. ఇలా ఏడు ద్విచక్రవాహనాలను చోరీ చేసినట్లు డియస్‌పి తెలిపారు. నగరి డివిజన్ పరిధిలో ఎద్దైనా దొంగతనాలు, చైన్‌స్నాచింగ్, గంజాయి, సారాతయారీలపై ఉక్కుపాదం మోపతామన్నారు. చోరీ వాహనాలను పట్టుకున్న సి.ఐ.హనుమంతప్ప, ఎస్ఐ రాజ్‌కుమార్‌లను అభినందించారు. అలాగే కానిస్టేబుల్స్ యిన యువరాజ్, రాజశేఖర్, లోక, నవీన్‌లకు రివార్డు అందించారు. నిందితున్ని రిమాండుకు తరలించారు

## పంచాయతీ కాంప్లెక్స్ వేలం వాయిదా వేయండి..!

రోడ్డు విస్తరణతో నష్టపోనున్న దుకాణదారులు

చంద్రగిరి, జనవరి 29 ప్రభాతవార్త:



చంద్రగిరి గ్రామపంచాయతీ కాంప్లెక్స్‌లో గదుల బహిరంగ వేలాన్ని వేలాన్ని వాయిదా వేయాలని స్థానికులు కోరుతున్నారు. ఎంఎల్‌ఏ పులివర్తి నాని చంద్రగిరిలో రోడ్డు విస్తరణపై పట్టుదలగా ముందుకు వెళుతున్న ప్రస్తుత పరిస్థితుల్లో విస్తరణ జరిగితే దుకాణదారులు నష్టపోయే ప్రమాదం వుందంటున్నారు. పంచాయతీ కాంప్లెక్స్‌కు కేవలం 15 అడుగుల దూరంలో రోడ్డు వున్నందున విస్తరణలో దుకాణం వరకు రోడ్డు వచ్చే అవకాశం లేకపోదని అంటున్నారు. ఈ నేపథ్యంలో వేలం నిర్వహించడం వలన దుకాణదారులు 14 నెలలు అద్దెను చెల్లించినట్లయితే రోడ్డు విస్తరణతో నష్టం జరిగే అవకాశం వుందని గుర్తు చేస్తున్నారు. కావున ప్రస్తుతం షాపులు నిర్వహిస్తున్న వారికే మరో రెండు మాసాలు పొడిగించి విస్తరణపై తగిన నిర్ణయం వెలువడే వరకు వేచిచూడాలని కోరుతున్నారు. ఇప్పటికే ఎంఎల్‌ఏ స్థానికులతో రెండు మూడు పర్యాయాలు రోడ్డు విస్తరణపై సలహాలు, సూచనలు కోరిన విషయాన్ని గుర్తుంచుకుని వేలంపై పంచాయతీ సర్పంచ్ ముద్దికుప్పం రూపరామమూర్తి, వార్డు సభ్యులు, పంచాయతీ ఈఓ మహేశ్వరయ్య పునఃపరిశీలించాలని కోరుతున్నారు.

## శివయ్య సన్నిధిలో సుభాష్‌పాలేకర్

శ్రీకాళహస్తి, జనవరి 29 ప్రభాతవార్త



శ్రీకాళహస్తీశ్వరాలయానికి బుధవారం పద్మశ్రీ అవార్డు గ్రహీత, సేంద్రీయ వ్యవసాయ నిపుణులు సుభాష్ పాలేకర్ శ్రీకాళహస్తీశ్వరాలయానికి విచ్చేశారు. ఈసందర్భంగా ఆయనకు దక్షిణగోపురం వద్ద తెలుగుదేశంపార్టీ నాయకులు డాక్టర్ పాకనాటి హరికృష్ణ, ఏరియా ఆస్పత్రి మాజీ చైర్మన్ డాక్టర్ రామకృష్ణ, డాక్టర్ గంగాధర్, రాంజీలు స్వాగతం పలికారు. అనంతరం ఆలయంలోని స్వామిఅమ్మవార్లను దర్శించుకుని పూజలు నిర్వహించుకున్నారు. దక్షిణభారత సాధకుడు విజయరామ్‌జీకూడా విచ్చేశారు. ఈసందర్భంగా ఆయనకు దక్షిణామూర్తి వద్ద దేవస్థానం అధికారులు స్వామిఅమ్మ చిత్రపటాన్ని అందించి వేదపండితుల ఆశీర్వచనాలను అందించారు.

# తిరుపతి డివిజన్

## జాతీయ టెక్ఫెస్ట్ పోస్టర్ ఆవిష్కరణ

తిరుపతి విద్య, జనవరి 29 ప్రభాతవార్త





పద్మావతి మహిళా వర్సిటీ స్కూల్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ ఆధ్వర్యంలో వచ్చేనెల 21 నుంచి జరగనున్న జాతీయ స్థాయి టెక్ ఫెస్ట్ కు సంబంధించిన పోస్టర్లను బుధవారం వీసీ ప్రొఫెసర్ ఉమ విడుదల చేశారు. ఆమె మాట్లాడుతూ విద్యుత్సావ్ 2కే25, మెకేరెనా2కే25 పేరుదో జాతీయ స్థాయి టెక్ఫెస్ట్ వర్సిటీలో నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎన్ రజనీ, ఎస్ఓఈటి డైరెక్టర్ ప్రొఫెసర్ పి మల్లికార్జున, ప్రొఫెసర్ వీరారెడ్డి, కోఆర్డినేటర్లు, కన్వీనర్లు, కో కన్వీనర్లు, విద్యార్థినులు పాల్గొన్నారు.

## దళితులకు ఇంటి స్థలాలు ఇప్పించండి

కేవీబీ పురం, జనవరి 29 ప్రభాతవార్త:

మండలంలోని కొత్తూరు గ్రామంలో నివాసం ఉంటున్న 35 దళిత కుటుంబాలకు ఇంటి స్థలాలు ఇప్పించాలని సీపీఎం ఆధ్వర్యంలో దళితులు తహసీల్దార్ మునిరత్నంకు వినతిపత్రాన్ని అందించారు. సీపీఎం జిల్లా కార్యదర్శి దాసరి జనార్ధన్ మాట్లాడుతూ గత ప్రభుత్వంలో దళితులకు ఇంటి పట్టాలు ఇస్తున్నట్లు ఆన్‌లైన్‌లో నమోదు చేసి మోసం చేశారని ఆరోపించారు. ఇప్పటికైనా ప్రభుత్వం ప్రకటించిన విధంగా గ్రామాల్లో మూడు సెంట్లు వంతున కొత్తూరు దళితులు, గిరిజనులకు 35 మందికి ఇంటి స్థలాలు మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ కార్యదర్శి వరలక్ష్మి, సభ్యులు శకుంతల, సునీత, సక్కమ్మ, నాగమ్మ, గిరిజ, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

## వీధి వ్యాపారులకు గుర్తింపు కార్డులు అందించాలి

పుత్తూరురూరల్, జనవరి 29 ప్రభాతవార్త:



అసంఘటితంగా ఉన్న వీధి వ్యాపారులను గుర్తించి వారికి గుర్తింపు కార్డులు, వ్యాపార లైసెన్సులు అందించడంతో పాటు వారికి మౌలిక సదుపాయాలు అందించాలని పుత్తూరు మున్సిపల్ కమిషనర్‌కి ఏఐటీయూసీ నాయకులు వినతిపత్రం అందించారు. వారు మాట్లాడుతూ వీధి వ్యాపారులను గుర్తించి వారికి గుర్తింపు కార్డులు, వ్యాపార లైసెన్సులు అందించడంతో పాటు మౌలిక సదుపాయాలు అందించాలని అన్నారు. వీధి వ్యాపారస్తులను గుర్తించి, సహజ మార్కెట్‌గుర్తింపు నిర్వహణ, నామమాత్రపు రుసుంతో గుర్తింపు కార్డు, వ్యాపార లైసెన్సు మంజూరు చేయాలన్నారు. వీధి వ్యాపారుల వద్ద గేట్ పేరుతో డబ్బులు వసూలు చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో వీధి వ్యాపారుల సంఘం పుత్తూరు పట్టణ అధ్యక్షుడు నజీర్‌బాయ్, కార్యదర్శి నవీన్, నాయకులు చాంద్‌బాషా, కాశి, రాము, రఫీ తదితరులు పాల్గొన్నారు.

## మహిళా వర్సిటీలో పలు కోర్సులకు ధరఖాస్తులు ఆహ్వానం

తిరుపతి విద్య, జనవరి 29 ప్రభాతవార్త:

పద్మావతి మహిళా వర్సిటీలో 2025 సంవత్సరానికి పలు కోర్సులలో ప్రవేశాల కొరకు ధరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు సెంటర్ ఫర్ డిస్టెన్స్ అండ్ ఆన్లైన్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఎం అరుణ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రధానంగా మాస్టర్ ఆఫ్ ఆర్ట్స్ (సంగీతం), మాస్టర్ ఆఫ్ కామర్స్, మాస్టర్ ఆఫ్ ఆర్ట్స్ (తెలుగు), డిప్లొమా ఇన్ మ్యూజిక్ (సంకీర్తన, వర్ణం, అన్నమయ్య అంతరంగం) కోర్సులలో ప్రవేశానికి అర్హులైన మహిళా అభ్యర్థుల నుంచి ఆన్లైన్ దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు పేర్కొన్నారు. దరఖాస్తు ఫారం, అర్హత, ఫీజు నిర్మాణం, కోర్సు వివరాలకోసం వర్సిటీ అధికారిక వెబ్సైట్‌ను సంప్రదించాలని కోరారు. ఈ నెల 31 లోపు ధరఖాస్తులను అందించాలని తెలియజేశారు. వివరాలకు 0877-2284524, 8121787415 ఫోన్ నెంబర్లను సంప్రదించవచ్చునని ఒక ప్రకటనలో తెలిపారు.

## 31వ తేదిలోపు టీచర్ ఇన్ఫర్మేషన్ సిస్టం నమోదుకు గడువు పెంపు

తిరుపతి కలెక్టరేట్, జనవరి 29 ప్రభాతవార్త :

తిరుపతి జిల్లాలో పనిచేస్తున్న ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులకు సంబంధించిన టీచర్ ఇన్ఫర్మేషన్ సిస్టం నమోదుకు ఈనెల 31వ తేది వరకు గడువు పెంచడం జరిగిందని జిల్లా విద్యాశాఖాధికారి కె.వివిఎన్ కుమార్ తెలిపారు. ఈ మేరకు బుధవారం డీఈవో మీడియాతో మాట్లాడారు. రాబోవు ఉపాధ్యాయుల పదోన్నతులు, బదిలీలు వారు నమోదు చేసిన వివరములు ప్రకారమే జరుగుతుందన్నారు. సవరణ చేయని ఎడల మరలా అవకాశం ఉండదన్నారు. ఈ విషయాన్ని జిల్లాలోని ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు తెలుసుకుని ఈ, అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

## కోరం లేక వాయిదా పడిన సాధారణ సమావేశం

రేణిగుంట, జనవరి 29 ప్రభాతవార్త:

రేణిగుంట మేజర్ పంచాయతీ కార్యాలయంలో బుధవారం జరగవలసిన సాధారణ సమావేశం కోరం లేక వాయిదా పడింది. పంచాయతీలో 20 మంది సభ్యులు ఉండగా సమావేశానికి ముగ్గురు సభ్యులు మాత్రమే హాజరయ్యారు. దీంతో సమావేశం కోరం లేకపోవడంతో వాయిదా వేస్తున్నట్టు అధికారులు ప్రకటించారు.

## ముగిసిన సెలేస్ట్రా25

తిరుపతి విద్య, జనవరి 29 ప్రభాతవార్త



పద్మావతి మహిళా వర్సిటీ స్కూల్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో గత రెండు రోజులుగా జరిగిన సెలేస్ట్రా 25 కార్యక్రమం బుధవారం ఘనంగా ముగిసింది. ఈ కార్యక్రమంలో వివిధ ఇంజనీరింగ్ కళాశాల, డిగ్రీ కళాశాల విద్యార్థులు పాల్గొని యువ ఆవిష్కర్తలు, తమ ఆలోచనలు సెలేస్ట్రా వేధికగా ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో ఐఐటీ ప్రొఫెసర్ సిహెచ్ శ్రీధర్, సోమురవి, ఇంజనీరింగ్ కళాశాల సంచాలకులు ప్రొఫెసర్ మల్లికార్జున, సీఎస్సీ విభాగాధిపతి ప్రొఫెసర్ సరిత, ఫ్యాకల్టీ కన్వీనర్ డాక్టర్ సాయి లోహిత, పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

## చెరుకు సాగులో మెళకువలపై రైతులకు శిక్షణ

-వర్మికంపోస్టు, రసాయనికి ఎరువుల వాడకంతో అధికదిగుబడి

-సీనియర్ శాస్త్రవేత కె.ఆర్.ఠాకూర్

తిరుపతిరూరల్, జనవరి29 ప్రభాతవార్త:

చెరుకు సాగులో వర్మికంపోస్టు ఎరువులతో పాటు రసాయనిక ఎరువులు వాడకం వల్ల అధిక దిగుబడులు సాధించవచ్చునని సీనియర్ శాస్త్రవేత్త కె.ఆర్.ఠాకూరు, డాక్టర్ ఎన్‌వి.సరళ అన్నారు. బుధవారం పెరుమాళ్ళపల్లిలోని వ్యవసాయ కేంద్రంలో షెడ్యూల్డ్ కులాల ఉప ప్రణాళిక పథకం –2024–25 కింద విజయపురం, కార్వేటినగరం, పాలసముద్రంలో ఎంపిక చేసిన 20మంది చెరుకు రైతులకు చెరుకు సాగుపై శిక్షణ ఇచ్చారు. చెరుకు విత్తన ఎంపికతో పాటు అధిక దిగుబడి, అధిక చక్కెర శాతం కలిగిన చెరుకు వంగడాలను ఎంపిక చేసుకోవాలని సూచించారు. చెరుకులో కలుపు నివారణకు అట్రాజిన్ పిచికారి చేసుకోవాలన్నారు. చెరువు విత్తే సమయంలో జంటశాల పద్దతిని అవలంభించాలన్నారు. ఈ పద్దతిని అవలంభించడం ద్వారా చెరుకులో కలుపుతీయుటకు వీలుగాను, కోతకు వీలుగాను ఉంటుందని తెలిపారు. చెరుకు జీవ ఎరువులతో పాటు యూరియా, పాస్ఫేట్‌ను వాడాలని సూచించారు. అనంతరం రైతులకు ఎరువులు, క్రిమిసంహార మందులు, స్ప్రేరే మిషన్‌లు, విత్తనాలు అందించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ బి.వజంత, డాక్టర్ నాగముని తదితరులు పాల్గొన్నారు.

## ఎస్వీ సైన్స్ అండ్ డిగ్రీ కాలేజ్, సహస్ర విజ్ఞాన్ వార్షికోత్సవం

తిరుపతి, జనవరి 29 ప్రభాతవార్త:



ఎస్వీ సైన్స్ అండ్ డిగ్రీ కళాశాల, సహస్ర విజ్ఞాన్ వార్షికోత్సవం బుధవారం ఘనంగా నిర్వహించారు. బుధవారం ఓ ప్రవేట్ పంక్షన్ హాలులో జరిగిన వార్షికోత్సవంలో ముఖ్యఅతిధిగా విచ్చేసిన ప్రొపెసర్ భూపతినాయుడు, గౌరవ అతిధిలుగా బి.శేషారెడ్డి, వై. ఆనందరెడ్డిలు పాల్గొన్నారు. గౌరవ అతిధిగా విచ్చేసిన శేషారెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు కాలం యొక్క విలువ తెలుసుకుని మసులుకోవాలని తెలిపారు. విద్యార్థి దశ నుంచే లక్ష్యాన్ని ఎంచుకుని ఆదిశగా నిర్విరామంగా అడుగులు వేసినప్పుడే అనుకున్న గమ్యాన్ని చేరుకోగలరని సూచించారు. ఏదైన సులభతరంగా కాకుండా పోరాడి సాధించినప్పుడే ఆ కిక్కు వేరే లెవల్ ఉంటుందని తెలిపారు. వై.ఆనందరెడ్డి మాట్లాడుతూ తల్లిదండ్రుల కష్టాన్ని వృధా చేయకుండా విద్యార్థులు ఉన్నత ఆశయంతో ఉన్నత స్థానాన్ని చేరుకోవాలని సూచించారు. అనంతరం పలు పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేసారు. ఈ వార్షికోత్సవంతో డైరెక్టర్ జి.ధనంజయరెడ్డి, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

## తై అమావాస్య అన్నదానాలు:

శ్రీకాళహస్తి, జనవరి 29 ప్రభాతవార్త



శ్రీకాళహస్తి పుణ్యక్షేత్రంలో తై అమావాస్య సందర్భంగా వాడ వాడల్లో అన్నదానాలను నిర్వహించారు. బుధవారం పట్టణంలోని నాలుగు మాడావీధుల్లో అడుగుగడుగునా వివిధ స్వచ్ఛంద సేవా సంస్థలు తమసేవలందించారు. ఈ నేపథ్యంలో నెహ్రూవీధిలోని ఎస్‌వి డెంటల్ ఆసుపత్రి నిర్వాహకులు డాక్టర్ లక్ష్మీనారాయణ సారథ్యంలో అన్నదానం ఏర్పాటు చేసారు. కాగా రాజగోపురం, బజారువీధిలోని శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి నిత్యాన్న సత్రం వద్ద భోజనాలు ఏర్పాటు చేసారు. అన్నదానాలతో హోటళ్ళు ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

# గూడూరు డివిజన్

## పెన్షన్‌దారుల వివరాలను సర్వే చేసిన సిబ్బంది



బాలాయపల్లి, జనవరి 29 ప్రభాతవార్త: ఎన్టీఆర్ సామాజిక భద్రత పెన్షన్లను తీసుకుంటున్న లబ్ధిదారు లు అర్హులా, అనర్హులా అన్న నివేదికపై క్షేత్రస్థాయిలో ఏసీ సుబ్బారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రి వైద్య బృందం వైద్యాధికారులు అనిల్ బాబు, రాధిక, బాలాయపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం అధికారిణి లిఖిత, సచివాలయ సిబ్బంది వారి నివాసాలకు వెళ్లి పెన్షన్‌దారులను బుధవారం పరిశీలించారు. వారి అర్హత, ఆధార్‌కార్డు, పెన్షన్‌కార్డులు ఇతర ధృవపత్రాలను పరిశీలించారు. మంచానికే పరిమితమైన వారు మండలంలో 18 మంది పెన్షన్‌దారులు ఉన్నారని వైద్యులు తెలిపారు. ఈ తనిఖీల్లో సుబ్బారెడ్డి ప్రభుత్వఆసుపత్రి వైద్య బృందం, ఏఎంఎంలు పాల్గొన్నారు.

## కల్లుగీత కార్మికులకు మద్యం షాపులు : డిప్యూటీ కమిషనర్



వెంకటగిరి, జనవరి 29 ప్రభాతవార్త : కల్లుగీత కార్మికులకు ప్రభుత్వం మద్యం షాపులు కేటాయించినట్లు ఎక్సైజ్, ప్రొహిబిషన్ డిప్యూటీ కమిషనర్ విజయ్ శేఖర్ తెలిపారు. వెంకటగిరిలోని ఎక్సైజ్ స్టేషన్‌లో ఆయన సిఐ సూరి నారాయణరావుతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వెంకటగిరి మున్సిపాలిటీ, బాలాయపల్లి, డక్కిలి మండలాలకు సంబంధించి గీత కులాలలోని ఈడిగ సబ్ కానిస్టేబుల్ వారికి మూడు మద్యం దుకాణాలను కేటాయించడం జరిగిందన్నారు. లైసెన్సుఫీజు కింద వెంకటగిరి మున్సిపాలిటీకి 21,66,667 డక్కిలి, బాలాయపల్లి మండలాలకు 18,33,334 రూపాయిలు కేటాయించడం జరిగిందన్నారు. దరఖాస్తు స్వీకరణ 27వ తేదీ నుండి 5వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు స్వీకరిస్తారని తెలిపారు. తేదీ 7వ తేదీన లాటరీ పద్ధతిలో తరుపతి జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో తిరుపతి కలెక్టర్ కార్యాలయం నందు లాటరీ ప్రక్రియ ద్వారా జరుగునని తెలిపారు.

## వైసిపి నేతలపై అక్రమ కేసులు, దాడులు దారుణం

**-నియోజకవర్గ సమన్వయకర్త రామ్ కుమార్ రెడ్డి**



వెంకటగిరి, జనవరి 29 ప్రభాతవార్త : వైసిపి పార్టీ వారిపై తెలుగుదేశం పార్టీకి చెందిన వారి దాడులు చేయడం దారుణమని వైసిపి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రాంకుమార్‌రెడ్డి తెలిపారు. వెంకటగిరిలోని ఆయన నివాస గృహంలో పలువురు నాయకులు, కార్యకర్తలు నేదురుమల్లిని కలిసి సమస్యలు తెలుసుకున్నారు.ఆయన మాట్లాడుతూ డక్కిలి మండలం గొల్లపల్లి గ్రామానికి చెందిన భాస్కర్‌నాయుడుపై కొందరు వైసిపి వారు దాడి చేయడం విచారకర మన్నారు. న్యాయపరంగా వారి దౌర్జన్యాలను దాడులను ఎదుర్కొంటామని చెప్పారు. ఆయన వెంట మున్సిపల్ వైస్ చైర్మన్ బాలయ్య, కౌన్సిలర్లు వహిదా, శ్రీనివాసులు, నాయకులు దశరధ రామ్‌రెడ్డి, సిపిఎల్ నరసింహారావు, వేముల వెంకటేశ్వర్లు, మురళీకృష్ణ తదితరులు ఉన్నారు.

## కార్యకర్తలకు అండగా ఉంటారు:నేదురుమల్లి



బాలాయపల్లి, జనవరి 29 ప్రభాతవార్త: వైసిపి పార్టీ కార్యకర్తలు నాయకులకు అండగా ఉంటానని నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రాంకుమార్ రెడ్డి తెలిపారు. మన్నూరుకు చెందిన వైసిపి నేత కాటూరు ప్రసాద్‌రెడ్డి తండ్రి ఇటీవల మరణించినారని తెలుసుకుని వారి నివాసానికి వెళ్లి చిత్రపటానికి పూలమాలలు వేసి ఆయన నివాళులర్పించారు. మండల పార్టీ అధ్యక్షులు వెందోటి కార్తీక్‌రెడ్డి, వైసిపి నేతలు ఉన్నారు.

## ఇస్రో, నాసా సంయుక్త ఉపగ్రహం నిసార్ ప్రయోగం త్వరలోనే

**- ఇస్రో చైర్మన్ వి.నారాయణన్**



శ్రీహరికోట (తడ), జనవరి 29 ప్రభాతవార్త: ఇస్రో, నాసాలు కలిసి సంయుక్తంగా నిసార్ ఉపగ్రహాన్ని శ్రీహరికోట నుంచి త్వరలో ప్రయోగి స్తున్నట్లు ఇస్రో చైర్మన్ వి.నారాయణన్ పేర్కొన్నారు. జిఎస్ఎల్‌వి– ఎఫ్16 రాకెట్ ద్వారా ఈ ప్రయోగం ఉంటుందన్నారు. బుధవారం ఆయన షార్‌లోని మీడియా సెంటర్లో సహచర శాస్త్రవేత్తలతో కలిసి మాట్లాడారు. రాకెట్ ప్రయోగం జరుగుతున్నంత సేపు నూతన సారధి నారాయణన్ కొంత ఉద్విగ్నతతో కనిపించారు. మూడు దశలు రాకెట్ ప్రయోగం ముగిసిన తర్వాత ఆయన ఆనందంతో ఉక్కిరిబిక్కిరి అయ్యారు. పక్కనే ఉన్న షార్‌డైరెక్టర్ తదితరులను హత్తుకొని ఆనంద భాష్పాలు కార్చారు. బుధవారం తమిళులకు అత్యంత ఇష్టమైన తైఅమావాస్య కావడంతో పక్కా తమిళవాసి నారాయణన్‌కు అదేరోజు తొలి విజయం లభించింది. అనంతరం మీడియా సెంటర్లో ఆయన సహచర శాస్త్రవేత్తలతో కలిసి ఉపగ్రహం, రాకెట్ నమూనాలు ప్రదర్శించారు. భవిష్యత్ ప్రయోగాల గురించి ఆయన మాట్లాడుతూ గగన్‌యాన్ ప్రాజెక్టుకు సంబంధించిన వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నా మన్నారు. శ్రీహరికోటలో మూడవ ప్రయోగ వేదిక శంకుస్థాపన కోసం ప్రధాని నరేంద్రమోడీని ఆహ్వానిస్తున్నామని, త్వరలోనే కార్యక్రమాల వివరాలు అందుతాయన్నారు. నాలుగవ ప్రయోగ వేదిక తమిళనాడులోని కులశేఖరపట్టణంలో నిర్మాణంలో ఉన్న సంగతిని గుర్తుచేస్తూ అక్కడ మరో రెండేళ్ల తర్వాత మాత్రమే రాకెట్ ప్రయోగాలు ఉంటాయని చెప్పారు. మిషన్ డైరెక్టర్ థామస్ కురియన్ మాట్లాడుతూ ఖచ్చితమైన ప్లేస్‌కి నావిక్ ఉపగ్రహం ప్రవేశించినట్లు చెప్పారు. వెహికల్ డైరెక్టర్ ధన, అసోసియేట్ వెహికల్ డైరెక్టర్ మేరీ మాథ్యూ, శాటిలైట్ డైరెక్టర్ కార్తీక్‌తో పాటు షార్ డైరెక్టర్ ఆర్ముగం రాజరాజన్, విఎస్ఎస్‌సి డైరెక్టర్ కున్హికృష్ణన్, యుఆర్ రావు శాటిలైట్ సెంటర్ డైరెక్టర్ శంకరన్,శాట్ డైరెక్టర్ నీలేష్ దేశాయ్, ఎల్‌పిఎస్‌సి డైరెక్టర్ మోహన్, ఇశాక్ డైరెక్టర్ ప్రవీణ్‌కుమార్, ఎన్ఆర్ఎస్‌సి డైరెక్టర్ ప్రకాష్ చౌహాన్, హెచ్ఎఫ్ఎఫ్‌సి డైరెక్టర్ టికె సింగ్‌లు పాల్గొన్నారు.

## నకిలీ విత్తనాలతో వ్యవసాయ రంగం నష్టపోతుంది



గూడూరు, జనవరి 29 ప్రభాతవార్త: నకిలీ విత్తనాలతో అన్నదాతలతో పాటు వ్యవసాయ రంగం తీవ్రంగా నష్టపోతుందని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పంట శ్రీనివాసులురెడ్డి అన్నారు. గూడూరు సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద సిపిఎం, సిపిఐ నాయకులతో కలిసి నకిలీ విత్తనాలపై నిరసన వ్యక్తం చేశారు. గూడూరు నియోజకవర్గంలో వ్యవసాయశాఖ అధికారుల నిర్లక్ష్య వైఖరి కారణంగా నకిలీ విత్తనాలు, ఫర్టిలైజర్స్‌తో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని అన్నారు. రైతులు లక్షల రూపాయిలు పెట్టుబడులు పెట్టి వ్యవసాయం చేస్తుంటే మరోవైపు నకిలీ విత్తనాలతో అక్రమార్కులు దగా చేస్తున్నారని వారిపై కఠిన చర్యలు తీసుకొని రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

## ఘనంగా ఎల్‌పిపి పాఠశాల వార్షికోత్సవం



చిల్లకూరు, జనవరి 29 ప్రభాతవార్త: చిల్లకూరులోని శారద నగర్ ప్రాంతంలో ఏర్పాటై ఉన్న లిటిల్ ఏంజెల్స్ పబ్లిక్ పాఠశాలలో 40వ వార్షికోత్సవ దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా విచ్చేసిన ప్రముఖ మోటివేషన్ స్పీకర్ సుధీర్ శాండ్రా, కరస్పాండెంట్ శ్రీకాంత్ రెడ్డి చేతుల మీదుగా జ్యోతి ప్రజ్వలన చేశారు. కరస్పాండెంట్ శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ విలువలతో కూడిన విద్యను అందించడమే ఎల్‌పిపి ముఖ్యలక్ష్యమన్నారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందర్ని ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో పాఠశాల ఫౌండర్ బి.సుబ్రమణ్యంరెడ్డి, పిఈటి సెక్రటరీ దయాకర్‌రెడ్డి ప్రిన్సిపాల్ నమశివాయం, ప్రధానోపాధ్యాయులు సురేష్ కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## 10 మద్యం బాటిల్స్ పట్టివేత



వాకాడు, జనవరి 29 ప్రభాతవార్త: అక్రమంగా బెల్ట్ షాపు నిర్వాకదారుడు వద్ద మద్యం అమ్ముతున్న 10 మద్యం బాటిల్స్ పట్టుకుని కేసు నమోదు చేసి అరెస్టు చేశారు. వాకాడు ఎక్సైజ్ సిఐ ప్రసాద్ ప్రకటన మేరకు వాకాడు మండలం కల్లూరు పంచాయితీ పరిధిలోని పల్లిపాలెం గ్రామంలోని సమీపంలో కూల్ డ్రింక్ షాప్‌లో మద్యం అమ్ముతున్నాడని సమాచారం అందడంతో సమాచారం మేరకు దాడులు చేయగా 19 మద్యం బాటిల్స్ పట్టుకని కేసు నమోదు చేసి పాకం చెంగయ్యను అరెస్టు చేశారు. ఈ కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్స్ రాధాకృష్ణ రాజయ్య, కానిస్టేబుల్స్ పి.వెంకటేశ్వర్లు, రమణయ్య, పోలయ్య, జయచంద్ర తదితరులు ఉన్నారు.

## వసంత లక్ష్మిని సత్కరించిన ఎమ్మెల్యే



వెంకటగిరి, జనవరి 29 ప్రభాతవార్త : పట్టణానికి చెందిన వసంతలక్ష్మి యోగాలో గిన్నిస్ బుక్ రికార్డు సాధించినందుకు ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ ఆమెను సత్కరించారు. తన వంతు సహాయ సహకారాలను వసంత లక్ష్మికి అందజేస్తానని తెలిపారు. వసంత లక్ష్మికి అవసరమైన సహాయ సహకారాలు అందిస్తానని ఎమ్మెల్యే తెలిపారు. వెంకటగిరి కళలు క్రీడలకు పెట్టింది పేరు అని తెలిపారు. వసంత లక్ష్మి గిన్నిస్ బుక్ రికార్డు సాధించడం అభినందించదగ్గ విషయం అన్నారు. యోగ ఉపయోగాలు గురించి అందరికీ తెలియజేయడమే లక్ష్యమని గిన్నస్ బుక్ రికార్డు విజేత వసంతలక్ష్మి తెలిపారు. 180 డిగ్రీల కోణంలో యోగా మూడున్నర గంటలకు ప్రదర్శించి గిన్నిస్ బుక్ రికార్డు సాగించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఏఎంసీ చైర్మన్ రాజేశ్వర రావు, తెలుగు యువత రాష్ట్ర కార్యదర్శి కెవికె ప్రసాద్ నాయుడు, మండల పార్టీ అధ్యక్షుడు పప్పు చంద్రమౌళి రెడ్డి, మాజీ మున్సిపల్ వైస్‌చైర్మన్ రాజేశ్వర రావు, నాయకులు ఆనందు, సత్యనారాయణ, బాబు నాయుడు తదితరులు పాల్గొన్నారు.

## దళారీల దందా ఎక్కువగా ఉంది



వెంకటగిరి, జనవరి 29 ప్రభాతవార్త:తహశీల్దార్ కార్యాలయంలో దళారుల దందా ఎక్కువగా ఉందని 14వ వార్డు కౌన్సిలర్ ఆరిశంకరయ్య ఆరోపించారు. బాల సముద్రం గ్రామంను పైలట్ గ్రామంగా వెంకటగిరి మండలంలో ఎంపిక చేసి రీసర్వే మొదలు అయింది. ఇందుకు గాను గ్రామ సర్వేయర్లు 4 టీమ్స్‌గా ఏర్పడి బాలసముద్రం గ్రామంను నాలుగు బాగాలుగా చేసుకొని రీసర్వే గ్రౌండ్ ట్రూతింగ్ ప్రక్రియ ప్రారంభించారు. ముద్ద కిరణ్ బాబు, కాసారం అశోక్, సుధీర బాబు, ఉమాదేవి, ఎ. అజయ్, పృధ్వి, దావల సాయి, గోవింద కృష్ణా, లలిత, సాయి రామ్, రవి, వెంకయ్య, తిరుమలగా వేశారు. ప్రతి టీంకు వాట్సాప్ గ్రూప్ క్రియేట్ చేసి రైతులను కూడా అందులో చేర్చి రైతులకు ఎటువంటి సమస్యలనైనా తెలిపినచో రికార్డు ప్రకారం పరిష్కరించబడునని తెలిపారు. ప్రభుత్వ రికార్డు ప్రకారం అన్నీ చూసి చేయాల్సిందిగా, అడివి పొరంబోకులకు ఆక్రమించుకొని 1 బి అడంగల్ కోసం కొంత మంది దళారులు నిత్యం తహశీల్దార్ ఆఫీస్ చుట్టు తిరుగుతున్నారు.

## ఫిబ్రవరి 1,2 తేదీల్లో బాలికలకు కబడ్డీ పోటీలు:సిఐ



వెంకటగిరి, జనవరి 29 ప్రభాతవార్త : నియోజకవర్గం స్థాయిగా బాలికలకు కబాడీ టోర్నమెంట్ వెంకటగిరి పోలీసు శాఖ వారిచే విశ్వోదయ గవర్నమెంట్ జూనియర్ కాలేజీ నందు ఫిబ్రవరి 1వ తేదీ, 2వ తేదీన జరుగుతుందని సిఐ ఏవి రమణ తెలిపారు. ఈ కబాడీ టోర్నమెంట్ ఫిబ్రవరి 1వ తేదీన ఉదయం 8 గంటలకు మొదలవుతుంది. వెంకటగిరి నియోజకవర్గంలో ఉన్నటువంటి అన్ని గవర్నమెంట్ స్కూల్స్, ప్రైవేట్ స్కూల్స్ నందు చదువుతున్న 16 సంవత్సరాల వయస్సులోపు ఉన్నటువంటి బాలికలు టీమ్స్ ఇవ్వాలని చెప్పారు.

## ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి




గూడూరు, జనవరి 29 ప్రభాతవార్త: అంగన్వాడి వర్కర్లు, హెల్పర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా క్రమబద్ధీకరణ చేయాలని అంగన్వాడి గూడూరు రూరల్ అధ్యక్ష, కార్యదర్శులు ఎ. ఇంద్రావతి, బిఎస్ ప్రభావతిలు తెలియజేశారు. బుధవారం స్థానిక సిఐటియు కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఐసిడిఎస్ స్కీమును సంస్థాగతం చేయుటకు, గుజరాత్ ప్రభుత్వం సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు ప్రకారం గ్రాడ్యుయేట్ చెల్లింపు 2024 ఆగస్టు 2న గుజరాత్ హైకోర్టు ఆదేశాల ప్రకారం గ్రేడ్ 3, గ్రేడ్ 4. ప్రభుత్వ ఉద్యోగులుగా అంగన్వాడి వర్కర్లు, హెల్పర్లను క్రమబద్ధీకరణ చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి రూరల్ అధ్యక్షురాలు ఏ. ఇంద్రావతి, కార్యదర్శి బిఎస్ ప్రభావతి, కమిటీ సభ్యులు బి. మంగమ్మ, జె. లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## వసతుల కల్పనకుప్రాధాన్యత ఇస్తున్నాం : ఎమ్మెల్యే



గూడూరు, జనవరి 29 ప్రభాతవార్త: ప్రజలకు మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత ఇస్తున్నామని ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ పేర్కొన్నారు. గూడూరు శివారు ప్రాంతమైన చవట గిరిజన కాలనీలో ఎమ్మెల్యే అధ్యక్షతన బుధవారం గ్రామ సభ నిర్వహించారు. వివిధ శాఖల అధికారుల హాజరు కావడంతో గ్రామ సభలో స్థానికులు వారి వ్యక్తిగత, మౌలిక వసతులపై పలు అర్జీలను ఎమ్మెల్యే, అధికారులకు అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ ప్రాంతంలో సమస్యలు పరిష్కరించాలని గ్రామ సభ నిర్వహించడం జరుగుతుందని ప్రజలు సభ దృష్టికి తీసుకువచ్చిన సమస్యలన్నింటిని ప్రణాళికబద్ధంగా పరిష్కరించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేయడం జరిగిందని తెలిపారు. అదే విధంగా అన్యాక్రాంతమై ఉన్న పేదల భూములను విడిపించి తిరిగి వారికి అందజేసే విధంగా రెవెన్యూ శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సారధ్యంలో ఎన్డీఏ ప్రభుత్వం పనిచేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ వెంకటేశ్వర్లు, తహశీల్దార్ చంద్రశేఖర్, ఎంపిడిఓ మధుసూధన్ రావు, టిడిపి నాయకులు కొండూరు వెంకటేశ్వర రాజు, మట్టంశ్రావణి, నెలబలి భాస్కర్ రెడ్డి, అధికారులు, టిడిపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## భూ హక్కులు కల్పించాలని ఆత్మహత్యాయత్నం!



డక్కిలి,జనవరి 27పభాతవార్త: డక్కిలి మండలంలోని దగ్గవోలు గ్రామానికి చెందిన కామిశెట్టి రవికుమార్, కామిశెట్టి చంద్రశేఖర్‌లు బుధవారం స్థానిక తహశీల్దారు కార్యాలయంలో ఆత్మహత్యా యత్నానికి పాల్పడ్డారు. ఈసంఘటన వివరాలు ఇలా ఉన్నాయి. బుధవారం తహశీల్దారు లేని సమయంలో ఆత్మహత్యా యత్నానికి పాల్పడ్డ ఇద్దరూ తహశీల్దారు కార్యాలయానికి చేరుకుని తాము ఎన్నో సంవత్సారాలు నుంచి సాగు చేసుకుంటున్న భూములకు హక్కులు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని డిప్యూటీ తహశీల్దారు ప్రసన్నను కోరారు. తహశీల్దారు వచ్చిన అనంతరం మాట్లాడుతామని ఆమె చెబుతున్న సమయంలోనే వారు ఇద్దరూ తమ వెంట తెచ్చుకున్న పెట్రోల్‌ను పోసుకుంటుండగా డిప్యూటి తహశీల్దారు పెట్రోల్ క్యాన్‌ను లాక్కొని వారిపై సమపంలో ఉన్న నీటిని చల్లారు.అయినా వారు ఇద్దరూ పెద్దగా కేకలు వేస్తూ విధులు నిర్వహిస్తున్న ప్రసన్న విధులకు ఆటంకం కలిగించారు.దీంతో వారిపై డక్కిలి పోలీసు స్టేషన్‌లో డిప్యూటి తహశీల్దారు ఆత్యహత్యాయత్నం,విధులకు ఆటంకం కలిగించి నట్లు ఫర్యాదు చేయగా ఎస్ఐ శివశంకర్ కేసు నమోదు చేశారు. ఈసంఘటనపై ఎస్ఐ మాట్లాడుతూ ప్రభుత్వ కార్యాలయాల్లో అధికారుల విధులకు ఆటంకం కలిగించినా,ఆత్మహత్యాయత్నానికి పాల్పడినా నేరమని తెలియజేశారు. తహశీల్దారు బుధవారం దగ్గవోలు గ్రామానికి రెవిన్యూ బృందంతో వెళ్లి భాధితులు సాగు చేసుకుంటున్న భూములు పరిశీలించారు. కొంత పొలం అటవీశాఖకు చెందందిగా అధికారులు సర్వేలో గుర్తించారు.

## జయహో ఇస్రో



బంగారుపాళ్యం, జనవరి 29 ప్రభాతవార్త: ఇస్రో షార్ కేంద్రం వంద ప్రయోగాలు చేపట్టి పూర్తి చేయడంను గుర్తిస్తూ బుధవారం టేకుమంద జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు జయహో ఇస్రో నినాదాలు చేశారు. పాఠశాలకు చెందిన అబ్దుల్ కలాం సైన్స్ క్లబ్ ఆధ్వర్యంలో విద్యార్థులు గ్రామ పురవీధుల్లో ఇస్రో విజయంను నినాదిస్తు ర్యాలీ నిర్వహించారు. ఇస్రో 100 ఆకారంతో విద్యార్థులు కూర్చొని ఇస్రోకు జేజేలు పలికారు. సైన్స్ ఉపాధ్యాయులు షంషీంఖాన్, విజయకుమారిలు మాట్లాడుతూ ఇస్రో విజయాలు నూర ప్రయోగ విశేషాలను విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో హెడ్మాస్టర్ అబ్దుల్ సుభాన్, ఉపాధ్యాయులు వేణుగోపాల్‌రెడ్డి, జయప్రకాష్, కేశవులు, అన్నపూర్ణ, దేవకి, సుబలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

## పరిశ్రమల ఏర్పాటుకు భూముల కేటాయింపుపై దృష్టి

**- కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశం**



చిత్తూరు, జనవరి 29 ప్రభాతవార్త: జిల్లాలో పరిశ్రమల ఏర్పాటు చేయడానికి ముందుకు వచ్చే ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు అవసరమైన భూముల కేటాయింపులపై ప్రత్యేక దృష్టి పెట్టాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని సమావేశభవనంలో బుధవారం కలెక్టర్ సుమిత్‌కుమార్ అధ్యక్షతన జిల్లా పరిశ్రమలు, ఎగుమతి, ప్రోత్సాహక కమిటీ సమావేశం జిల్లా పరిశ్రమల కేంద్రం ఆధ్వర్యంలో జరిగింది. ఈ సమావేశంలో కలెక్టర్ సుమిత్‌కుమార్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పరిశ్రమలు ఏర్పాటు చేసి తద్వారా ఉపాధి అవకాశాలు కల్పించడంపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరిం చిందన్నారు. జిల్లాలో నూతన పారిశ్రామిక విధానం అమలు మేరకు పరిశ్రమలు ఏర్పాటు కానున్నాయని, ఈ మేరకు పరిశ్రమల ఏర్పాటు ద్వారా ఆర్థిక పురోభివృద్ధితో పాటు ఉపాధి అవకాశాలు మెరుగుపడు తాయన్నారు. ఆ దిశగా సంబంధిత అధికారులు సమన్వయంతో కలిసి విధులు నిర్వర్తించాలని ఆదేశించారు. అలాగే పరిశ్రమల ఏర్పాటు కోసం భూముల కేటాయింపులకు సంబంధించి ఆన్‌లైన్‌లో రిజిస్టర్ చేసుకున్న వారితో తిరస్కరించబడిన ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలతో జిల్లా పరిశ్రమల కేంద్రం అధికారులు, ఎపిఐఐసిసి అధికారులు సమావేశం నిర్వహించాలన్నారు. భూమి కేటాయింపులకు సంబంధించి నియమ నిబంధనలు అనుసరించడంపై అవగాహన కల్పించాలని తద్వారా ఔత్సాహిక పారిశ్రామివేత్తలకు ఈ విషయంపై అవగాహన పెరుగుతుందన్నారు. జిల్లాలో 2024-25 ఆర్థిక సంవత్సరానికి ఇప్పటి వరకు రూ.544 కోట్లతో 60 వేల మందికి ఉపాధి కల్పించేలా 14,761 సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల ఏర్పాటుకు పోర్టల్ దరఖాస్తులు స్వీకరించడం జరిగిందన్నారు. అలాగే సింగిల్ డెస్క్ పోర్టల్ కింద 19 డిసెంబర్ 2024 నుండి 19 జనవరి 2025 వరకు 109 దరఖాస్తులు స్వీకరించగా ఇందులో 71 దరఖాస్తులను పరిశీలించి అనుమతులు మంజూరు చేశామన్నారు. అలాగే ప్రధానమంత్రి ఉపాధి కల్పన కింఆద రూ.4.73 కోట్లతో 131యూనిట్ల ఏర్పాటుకు అనుమతులు మంజూరు చేశామన్నారు. పిఎం విశ్వకర్మ యోజన కింద 1,560 మందికి శిక్షణ అందించామని, అలాగే జిల్లా స్థాయి ప్రాథమిక తనికీ కమిటీ ద్వారా 176 ఎంఎస్ఎంఇలకు రూ.10.90 కోట్లు ప్రోత్సహకాలు అందించామన్నారు. అలాగే ఔత్సామిక పారిశ్రామిక వేత్తలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో ఎంఎస్ఎంఇల ఏర్పాటుకు అవగాహన కార్యక్రమాల నిర్వహణలో భాగంగా గ్రామ, వార్డు సచివాలయ సిబ్బంది ద్వారా 28 జనరి 2025 నుండి ఇప్పటి వరకు 14,280 ఎంఎస్ఇంఇ యూనిట్లను సర్వే చేయడం జరిగిందని, ఈ ప్రక్రియ ఫిబ్రవరి వరకు కొనసాగుతుందన్నారు. పరిశ్రమల కేంద్రం జీఎం వెంకటరెడ్డి, డిప్యూటీ చీఫ్ ఇన్స్‌పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీ రామకృష్ణారెడ్డి, ఎపిఐఐసి జోనల్ మేనేజర్ సుబ్బారావు, ఎల్డీఎం హరీష్, జిల్లా పంచాయతీ అధికారి సుధాకర్‌రావు, జిల్లా వ్యవసాయ అధికారి మురళీకృష్ణ, జిల్లా ఉద్యానశాఖ అధికారి మధుసూధన్‌రెడ్డి, ఇతర సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## కన్నుల పండువగా కైలాసనాధుని లోబావి ఉత్సవం





శ్రీకాళహస్తి,జనవరి 29 ప్రభాతవార్త: దక్షిణ కైలాసంలో వెలసిన భోళాశంకరుని లోబావి ఉత్సవం కన్నుల పండువగా జరిగింది. ఏడాదిలో ఒక్కసారి ఇక్కడకు తైఅమావాస్య సందర్బంగా ఈ ఉత్సవాన్ని మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు ముందు నిర్వహించటం ఆనవాయితి.ఈ నేపథ్యంలో బుధవారం ఉదయం ఆలయంలోని అలంకార మండపంలో స్వామి అమ్మవార్ల ఉత్సవర్లను చక్కగా అలంకరిం చారు. మేళతాళాలు మంగళవాయిద్యాలతో సన్నిధివీధి, శివయ్యసదన్‌ల మీదుగా స్వామి అమ్మవార్లను వేలాది మంది భక్తులు వెంటరాగా లోబావి (భరద్వాజ తీర్థం) వద్దకు చేర్చారు. అక్కడ భరద్వాజేశ్వరుని ఆలయం ఎదురుగా ఉత్సవర్లను ప్రతిష్టించి వేద పండితులు వేదమంత్రాల్ని ఘోషిస్తుండగా శాస్త్రోక్తంగా ఆలయ అర్చకులు షోడషాభిషేకాలు నిర్వహించారు. భరద్వాజ తీర్థంలో ఉన్న మండపంలో ఏర్పాటు చేసి అభిషేకాలు జరిపారు. అనంతరం అక్కడ నుంచి స్వామి అమ్మవార్లకు ప్రత్యేకాలంకారం జరిపి బ్రహ్మగుడి వద్దకు తీసుకువచ్చారు. ఈ ఉత్సవంతో పాటు ఎఇఒ లోకేష్‌రెడ్డి టెంపుల్ ఇన్స్‌పెక్టర్ హరియాదవ్, సుదర్శనం, నాగభూషణం, ప్రధానార్చకులు సంబంధం గురుకుల్, ఉప ప్రధానార్చకులు కరుణాకర్ గురుకుల్, వేద పండితులు అర్ధగిరి స్వామి, అర్చకులు గోవింద్‌శర్మ ఆలయ సిబ్బంది, వారి సహచరులు పాల్గొన్నారు. ఆలయం నుంచి స్వామి అమ్మవార్లను చక్కగా అలంకరించుకొని ఊరేగింపుగా సాగారు. ఈ కార్యక్రమాల్లో ఇఒ టి.బాపిరెడ్డితో పాటు శాసనసభ్యుడు బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి మాతృమూర్తి బొజ్జల బృందమ్మ, సతీమణి బొజ్జల రిషితారెడ్డి భక్తులు విశేష సంఖ్యలో పాల్గొన్నారు.

## తల్లిదండ్రులకు కడుపుకోత

**కాలువలో కొట్టుకుపోయి కొడుకు మృతి**



చంద్రగిరి, జనవరి 29 ప్రభాతవార్త: అన్యం పుణ్యం ఎరుగక అల్లారుముద్దుగా వున్న కుమారుడి మరణం తల్లిదండ్రులకు కడుపుకోతను మిగిల్చింది. పనపాకం పంచాయతీ, పాతపేటకు చెందిన శరణ్య లోకేష్ ఆచ్చారి (అలియాస్ సిద్దయ్య) దంపతులకు ఒక కుమార్తె, ఇద్దరు కుమారులు వున్నారు. బుధవారం తై అమావాస్య కావడంతో పెద్దలకు బట్టలు పెట్టుకుని మ్రొక్కులు తీర్చుకోవడంలో భాగంగా తండ్రి సమాధి వద్దకు సిద్దయ్య బయలుదేరి వెళ్ళాడు. అయితే తల్లి స్నానానికి వెళ్ళడంతో తండ్రి వెంట చిన్న కుమారుడు తేజ (3) బయలుదేరి వెళ్ళాడు. ఇంటికి సమీపంలో వరదనీటి కాలువను దాటుకుని వెళ్ళిన సిద్దయ్య వెనుక తన కుమారుడు వస్తున్న విషయాన్ని చూసుకోలేదు. తేజ కాలువలో దిగడంతో వరదనీటిలో కొంత దూరం కొట్టుకుపోయి చెట్ల మధ్యలో చిక్కుకుని శ్వాస అందక మృతి చెందాడు. ఇవేమీ తెలియని తల్లి గ్రామంలో వెతుకులాడి కుమారుడి జాడ తెలియకపోవడంతో భర్తతో కలసి చంద్రగిరి పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు టోల్ ప్లాజా వద్ద సిసి పుటేజీలను పరిశీలించినప్పటికీ ఫలితం లేకపోయింది. అయితే తేజ తన తండ్రి వెంట వెళ్ళడాన్ని గమనించిన గ్రామస్తుడు విషయాన్ని తల్లిదండ్రుల దృష్టికి తీసుకువచ్చాడు. దీంతో గ్రామస్థులు కాలువలో వెతకడంతో బాలుడి మృతదేహం కంటపడింది. దీంతో ఒక్కసారిగా తలిదండ్రులు గుండెలవిసేలా రోధించారు. తల్లిదండ్రుల వేదన గ్రామస్థులను కంటపెట్టించింది.

## ఈవీఎం గోడౌన్ల తనిఖీ

రేణిగుంట, జనవరి 29 ప్రభాతవార్త: రేణిగుంట విమానాశ్రయానికి వెళ్లే పాత మార్గం వద్ద ఉన్న ఈవీఎం, వీవీ ప్యాట్‌లను భద్రపరిచే గోడౌన్‌లను కలెక్టర్ డా. ఎస్.వెంకటేశ్వర్ బుధవారం నెలసరి తనిఖీల్లో భాగంగా సందర్శించారు. షట్టర్లకు వేసిన సీళ్ళను, సీసీ కెమెరాలను పరిశీలించి భద్రత సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. కార్యక్రమంలో జీఎన్ఎస్ఎస్ డిప్యూటీ కలెక్టర్, నోడల్ అధికారి సుధారాణి, ఎన్నికల సూపరింటెండెంట్ ప్రసాద్, రేణిగుంట తహసీల్దార్ సురేష్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## అభివృద్ధి పనులు వేగవంతం చేయండి

**ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించిన కమిషనర్**



తిరుపతి కార్పొరేషన్, జనవరి 29 ప్రభాతవార్త: నగర పాలక సంస్థ పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని ఇంజనీరింగ్ అధికారులను కమిషనర్ ఎన్. మౌర్య ఆదేశించారు. నగరంలో జరుగుతున్న అభివృద్ధి పనుల్లో పురోగతి, పారిశుద్యం, పన్నుల వసూళ్లు, తదితర అంశాలపై వివిధ శాఖ విభాగాధిపతులతో నగర పాలక సంస్థ కార్యాలయంలో బుధవారం కమిషనర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. అలాగే అన్ని సచివాలయ కార్యదర్శులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా దిశానిర్దేశం చేశారు. కమిషనర్ మాట్లాడుతూ ప్రజలకు ఉపయోగకరమైన పనులను గుర్తించి అనుమతులు మంజూరు చేశామని, ఆ పనులకు త్వరగా పూర్తి చేయాలని అన్నారు. పెండింగ్‌లో ఉన్న అన్ని రకాల పన్నులను సకాలంలో వసూలు చేసి నగర అభివృద్ధికి కృషి చేయాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. నగరంలో పారిశుద్ధ్యం మరింత మెరుగ్గా చేపట్టేందుకు ప్రత్యేక ప్రణాళికలు సిద్ధం చేశామని వాటిని తప్పకుండా పాటించాలని, ప్రజల్లో ప్రణాళికలు సిద్ధం చేశామని వాటిని తప్పకుండా పాటించాలని ప్రజల్లో అవగాహన కల్పించేందుకు అందరూ సహకరించాలని అన్నారు. ఈ సమావేశంలో అదనపు కమిషనర్ చరణ్ తేజ్ రెడ్డి, డిప్యూటీ కమిషనర్ అమరయ్య, సూపరింటెండెంట్ ఇంజినీర్ శ్యాంసుందర్, మున్సిపల్ ఇంజినీర్లు తులసి కుమార్, గోమతి, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, రెవెన్యూ అధికారులు సేతుమాధవ్, రవి, డిసిపిమహాపాత్ర, డిఈలు, శానిటరీ సూపర్‌వైజర్లు తదితరులు ఉన్నారు.

## కారు దగ్ధం - ప్రయాణికులు సురక్షితం

రేణిగుంట, జనవరి 29 ప్రభాతవార్త: రేణిగుంట–కోడూరు మార్గంలో రేణిగుంట మండలం మామండూరు జాతీయ రహదారిపై కారు మంగళవారం రాత్రి మంటలు వ్యాపించి దగ్ధమైంది. ఈ ప్రమాదంలో ఎవరికి ఎలాంటి ప్రాణ నష్టం సంభవించలేదు. కోడూరు నుంచి ముగ్గురు ప్రయాణికులతో వస్తున్న ఇటియోస్‌కారులో మామండూరు వద్ద మంటలు వ్యాపించాయి. అందులో ఉన్న ప్రయాణికులు కిందకి దిగి మంటలను అదుపు చేసే ప్రయత్నం చేశారు. కానీ మంటలు అదుపుగాక కారు పూర్తిగా దగ్ధమైంది. విషయం తెలుసుకున్న అర్బన్ సీఐ శరత్‌చంద్ర, ఎస్ఐ అరుణ్‌కుమార్ సంఘటనా స్థలం చేరుకుని ఫైర్ సిబ్బందిని పిలిపించి మంటలను అదుపు చేయించారు. ట్రాఫిక్ జామైను క్రమబద్ధీకరించారు.

## ఏడుగురు పేకాటరాయుళ్ళు అరెస్టు-రూ.1.12లక్షలు నగదు స్వాధీనం

తిరుపతికార్పొరేషన్,జనవరి 29ప్రభాతవార్త: చట్టవ్యతిరేకంగా ఓ ఇంట్లో పేకాట ఆడుతున్న ఏడుమందిని అలిపిరి పోలీసులు బుధవారం రాత్రి అరెస్టు చేశారు. అలిపిరి సిఐ రామ్‌కిశోర్‌కు అందిన సమాచారంతో ఎస్ఐ నాగార్జునరెడ్డి సిబ్బందితో బ్యాంకు ఉద్యోగుల కాలనీలో ఓ ఇంటిపై దాడిచేశారు. ఆ సమయంలో పేకాట ఆడుతున్న ఇతర జిల్లాలకు చెందిన వారిని అదుపులోకి తీసుకున్నారు. వారినుండి 1,12,050 రూపాయలు నగదు,పేక ముక్కలు స్వాదీనం చేసుకుని పేకాటరాయుళ్ళను అరెస్టుచేసినట్లు సిఐ రామ్‌కిశోర్ తెలిపారు.

## ఎండమావిగా మారిన బ్యాంకు రుణాలు

గుడిపాల, జనవరి 29 ప్రభాతవార్త: నిరుపేద, మధ్యతరగతి ప్రజలకు బ్యాంకు రుణాలు ఎండమావిగా మారాయి. మండల పరిధిలోని ఏ ఒక్క బ్యాంకు సామాన్య మధ్యతరగతి, నిరుపేద ప్రజలకు ఒక్కటంటే ఒక్క రుణం మంజూరు చేయడం లేదని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. జిల్లా స్థాయిలో కలెక్టర్ బ్యాంకులకు రుణ లక్ష్యాలు నిర్దేశిస్తున్నప్పటికీ ఆ రుణ లక్ష్యాలను బ్యాంకులు తమకు అనుకూలంగా వున్న వారికి మాత్రమే మంజూరు చేసి లక్ష్యాలు పూర్తి చేసినట్లు గొప్పలు చెప్పుకుంటుండటంతో అసలైన నిరుపేద, మధ్యతరగతి ప్రజలకు బ్యాంకు నుండి రుణం పొందే అవకాశం కన్పించని పరిస్థితి నెలకొంది. గుడిపాల మండల కేంద్రంలో వున్న ఓ బ్యాంకు చుట్టూ రుణాల కోసం నిరుపేద, మధ్యతరగతి వర్గాలకు చెందిన ప్రజలు ప్రదిక్షిణలు చేస్తున్నప్పటికీ ఇప్పటి వరకు ఏ ఒక్కరికి రుణం మంజూరు కాని పరిస్థితి నెలకొంది. జిల్లా స్థాయి బ్యాంకర్ల సమావేశంలో అర్హులైన ప్రతి నిరుపేదలకు ముద్ర రుణాలు మంజూరు చేయాలని, అలాగే మహిళా సంఘాల్లో సభ్యులుగా వున్న పాడి రైతులు, దుకాణదారులు, ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలకు లక్‌పతి బీవీ పథకం కింద రుణం మంజూరు చేయాలని కేంద్ర ప్రభుత్వం బ్యాంకులకు స్పష్టమైన మార్గదర్శకాలు జారీ చేసింది. అయితే ఈ పథకం కింద డ్వాక్రా సంఘాల్లో పలుకుబడి వున్న కొంతమంది మహిళలు మాత్రమే బ్యాంకుల ద్వారా లబ్దిపొందుతున్నారు. మిగిలిన వారికి ఈ పథకం కింద రుణాలను బ్యాంకులు మంజూరు చేయడం లేదు. బ్యాంకు ద్వారా అసలైన అర్హత వున్న వారికి రుణాలు మంజూరు చేసి వారి ఆర్థిక అభివృద్ధికి బ్యాంకు కృషిచేయాలి.